ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
అనంతపురం
జిల్లా వార్తలు
గురువారం 18 ఏప్రిల్ 2024

నీటి మాట..!

‘ఇచ్చిన మాట.. తప్పితే ఓటు.. వెయ్యొద్దని చెప్పిన దమ్మున్నోడె జగనూ..’ వైసీపీ ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా వినిపిస్తున్న పాట ఇది. సీఎం జగన్ ఘనతను పొగుడుతూ, ఆయన మాట ఇస్తే తప్పరని ఊదరగొడుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో విపక్ష నాయకుడి హోదాలో వైఎస్ జగన్ చాలాసార్లు పర్యటించారు. పాదయాత్ర చేశారు. ప్రతి నియోజకవర్గానికి అనేక హామీలు ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి అయ్యాక కూడా ఆయన జిల్లాలో పర్యటించారు. అనేక హామీలు ఇచ్చారు. అన్నీ నీటిమీద రాతలే. వేటినీ అమలు చేసింది లేదు. ఈ లెక్కన.. ‘ఇచ్చిన మాట తప్పినందున.. ఓట్లు వేయాల్సిన అవసరం లేదు కదా..’ అని జనం ప్రశ్నిస్తున్నారు. మాట తప్పినందున.. ఇక ఆ పార్టీ అభ్యర్థులు ఓట్లు ఎలా అడుగుతారని కూడా నిలదీస్తున్నారు. సీఎం జగన్ ఇచ్చిన మాటలు.. తప్పిన మాటల గురించి నేటి నుంచి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాలు.



ఎండిపోయిన రాచెర్ల చెరువు


ద్విచక్ర వాహనంపై తాగునీటిని తీసుకెళ్తున్న విడపనకల్లు గ్రామస్థుడు


ఆగిపోయిన హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ కాలువ పనులు

- ఆయకట్టుకు అందని హంద్రీనీవా నీరు
- డిస్ట్రిబ్యూటరీల హామీని విస్మరించిన జగన్
- 2017 మహాధర్నాలో మాటిచ్చిన వైసీపీ అధినేత
- ఇప్పేరు చెరువుకు నీరూ.. ఉత్తిమాటే

ఉరవకొండ ✍

2017 ఫిబ్రవరిలో ఉరవకొండలో నిర్వహించిన మహాధర్నాలో జగన్ పాల్గొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో హంద్రీనీవా కాలువ కింద డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తిచేసి, ఆయకట్టుకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ హామీని అటకెక్కించారు.

ఆయకట్టుకు నీరేదీ..?

హంద్రీనీవా పనులు 2012లోనే 80 శాతం వరకూ పూర్తయ్యాయి. అప్పటి నుంచి ప్రధాన కాలువలో ఏటా నీరు ప్రవహిస్తోంది. కానీ ఆయకట్టుకు నీరు ఉపయోగించుకోలేని పరిస్థితి. పిల్ల కాలువల నిర్మాణం గురించి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆయకట్టును అభివృద్ధి పరచాలన్న ఆలోచనే చేయలేదు. హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం పూర్తి కాకపోతే.. ఈ నియోజకవర్గంలో హంద్రీనీవా నీరు ప్రవహించీ ప్రయోజనం లేకుండా పోతుంది. ప్రధాన కాలువ 33, 34, 36 ప్యాకేజీలో డిస్ట్రిబ్యూటరి పనులను కూడా గతంలోనే చేపట్టారు. 33, 34 ప్యాకేజీల్లో 90 శాతం పనులు పూర్తి అయ్యాయి. 36వ ప్యాకేజీలో 18 శాతం పనులు పూర్తి అయ్యాయి. వంతెనలు, కల్వర్టులు, అక్విడక్టుల నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక 25 శాతం కంటే తక్కువ పూర్తి అయిన పనులను రద్దు చేసింది. కొత్త ప్రతిపాదలను స్వీకరించింది. దీంతో పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు రూ.600 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. ఇందులో భూసేకరణ కోసం రూ.200 కోట్లు అవసరమని అంచనావేశారు. ఈ ప్రతిపాదనలకు కొన్ని సవరణలు చేస్తూ వెనక్కు పంపారని సమాచారం. ఈ ప్యాకేజీలు పూర్తి అయితే ఉరవకొండ, రాయదుర్గం, కల్యాణదుర్గం, గుంతకల్లు నియోజకవర్గాల్లో 1.18 లక్షల ఎకాలకు సాగు నీరు అందుతుంది. కానీ వైసీపీ ప్రభుత్వం దీని గురించి పట్టించుకోలేదు.

మళ్లీ అదే మాట..

ఉరవకొండలో ఈ ఏడాది జనవరి 23న నిర్వహించిన వైఎస్సార్ ఆసరా బహిరంగ సభలో సీఎం జగన్ పాల్గొన్నారు. మరోసారి ఉత్తుత్తి వాగ్దానాలు ఇచ్చారు. హంద్రీనీవా సుజల ప్రవంతి ద్వారా 75 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని అన్నారు. ఆ దిశగా డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం కోసం రూ.68 కోట్లు మంజూరు చేశామని ప్రకటించారు. కానీ ఇప్పటిదాకా ఆ నిధులు విడుదల కాలేదు. హంద్రీనీవా నుంచి చెరువులకు నీరందించేందుకు ఏర్పాటు చేసిన కాలవల కోసం భూములను కోల్పోయిన రైతులకు రూ.3.24 కోట్లు విడుదల చేస్తున్నామని ప్రకటించారు. అది కూడా నెరవేర్చలేదు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున.. ఇక ఇవన్నీ అటకెక్కినట్లే అని రైతులు నిట్టూరుస్తున్నారు.

బాలికల కాలేజీ..

ఉరవకొండలో బాలికల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారు. రెగ్యులర్ అధ్యాపకులను కూడా నియమిస్తామని అన్నారు. కానీ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. వైఎస్సార్ ఆసరా సభా వేదికపై ఇచ్చిన ఈ హామీ అమలుకు నిధులు, ఉత్తర్వుల ఊసు లేదు.

బిందు సేద్యాన్నీ విస్మరించారు..

టీడీపీ హయాంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రయోగాత్మకంగా ఉరవకొండ నియోజకవర్గంలో రూ.827 కోట్లతో బిందు సేద్యం పథకాన్ని ప్రారంభించారు. వెనుకబడిన ప్రాంతమైన ఉరవకొండ నియోజకవర్గంలో కరువును పారదోలాలన్నది ఈ పథకం లక్ష్యం. ఆసియాలోనే అతిపెద్ద ప్రాజెక్టు ఇది. వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ మెగా డ్రిప్ ఇరిగేషన్ పథకం అటకెక్కింది. ఈ ప్రాజెక్టు కోసం చంద్రబాబు ప్రభుత్వం సమకూర్చిన రూ.కోట్ల విలువ చేసే పరికరాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. టీడీపీ హయాంలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవ తీసుకుని, 2017లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఈ పథకాన్ని ప్రారంభింపజేశారు. ఉరవకొండ, కూడేరు, బెళుగుప్ప మండలాల్లో 50 వేల ఎకరాలకు నీరు అందించాల్సిన పథకం ఇది. ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీకి అప్పగించారు. పీఏబీఆర్, ఎంపీఆర్, జీడిపల్లి జలాశయం నుంచి 1.67 టీఎంసీలు వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించారు. ఈ పథకాన్ని నాలుగు భాగాలుగా విభజించి పనులను ప్రారంభించారు. కొన్ని గ్రామాల్లో 40 శాతం పనులు జరిగాయి. షేక్షానుపల్లి గ్రామంలో 3,600 ఎకరాలకు సాగునీరు అందించేందుకు భూ సేకరణ చేశారు. పంపింగ్ స్టేషన్ల నిర్మాణ పనులు పిల్లర్ దశలో ఆగిపోయాయి. ఆమిద్యాల, ఉదిరిపికొండ ప్రాంతాల్లో కోట్ల రూపాయలు విలువ చేసే పరికరాలను నిల్వ చేశారు. టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పథకం అన్న ఒకే ఒక్క కారణంతో వైసీపీ ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదు. ఫలితంగా 50 వేల ఎకరాలకు సాగునీరు అందకుండాపోయింది.

తాగునీటి సమస్య పట్టదా?

విడపనకల్లు మండల ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని హావళిగి, పాల్తూరు, గాజుల మల్లాపురం, ఉండబండ, చీకలగురికి, కరకముక్కల గ్రామాల తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.7.5 కోట్లతో ట్యాంకుల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఈ ఐదేళ్లలో ఏనాడూ సమస్యను పట్టించుకోలేదు. విడపనకల్లు మండలంలోనే అతి పెద్ద పంచాయతీలు పాల్తూరు, హావళిగి ఉన్నాయి. తాగునీరు లేక ఇక్కడి జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హావళిగి ఎస్సీ, బీసీ కాలనీలు, కోట వీధుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. పాల్తూరు ప్రజలు పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌కు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. కరకముక్కల ప్రజలు ఊరి చివర ఉన్న చేతి పంపు వద్దకు వెళ్లి తాగు నీరు తెచ్చుకుంటున్నారు. తాగునీటి సమస్య ఇంత తీవ్రంగా ఉన్న వైసీపీ నాయకులు పట్టించుకో లేదు. మంచి నీటి ట్యాంక్ నిర్మాణం కోసం టెండర్లు పిలిచారు. కానీ నిధులు లేక వదిలేశారు.

ఇప్పేరు చెరువుకు నీరేదీ..?

- కూడేరు మండలంలోని ఇప్పేరు చెరువుకు నీరిస్తానని పాదయాత్ర సమయంలో జగన్ హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక నిర్లక్ష్యం చేశారు. తీరా ఎన్నికల సమయంలో నీరిచ్చే ప్రయత్నాలు చేశారు. కానీ హంద్రీనీవా కాలువకు నీటి ఎత్తిపోతలు నిలిచిపోవడంతో చెరువుకు నీరు చేరలేదు. ఇప్పేరు చెరువు నిండితే సుమారు 20 గ్రామాల పరిధిలో భూగర్భ జలాలు పెరుగుతాయి. బోరు బావులు రీచార్జ్ అవుతాయి. తాగు, సాగునీటి సమస్య తీరుతుంది.
- జీడిపల్లి జలాశయం ముంపు బాధితులను ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో ఆదుకుంటామని ప్రకటించారు. ఇందుకు రూ.88 కోట్లు ఇస్తామన్నారు. ఈ హామీని సీఎం జగన్ నిలబెట్టుకోలేదు.

పులకించిన భద్రగిరి



భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం


కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


స్వామివారి ఊరేగింపు


ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు


గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



అంతా సిద్ధమేనా ?

- నేడు ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్.. నామినేషన్ల స్వీకరణ
- ప్రతి రోజూ నివేదికలు తప్పనిసరిగా పంపాలి
- సి-విజిల్ ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టరు, జేసీ, డీఆర్‌ఓ తదితరులు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 17: సార్వత్రిక ఎన్నికల్లో అసలైన ప్రక్రియకు అంతా సిద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ గురువారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ నేపథ్యంలో ప్రతి సమాచార నివేదికను ప్రతి రోజు పంపాలన్నారు. ఈనివేదికలు పంపే విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం చేయరాదని, అలా చేస్తే అందుకు తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఓటరు గుర్తింపుకార్డుల పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యాలయాలు, పోస్టాఫీసులలో ఏమాత్రం పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మే4న ఈసీఐ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించ నుందని అప్పటిలోగా ఎపిక్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. సీ- విజిల్ ఫిర్యాదుల విషయంలో ఎవరు నిర్లక్ష్యం చేయరాదన్నారు. వచ్చిన ఫిర్యాదులను వంద నిమిషాలలో పరిష్కరించాలన్నారు. నామినేషన్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. ప్రతి విషయంలోనూ ఎన్నికల కమిషన్ నిబంధనలు విధిగా పాటించాలని, ఎలాంటి ఆరోపణలు వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అధిక పోలింగ్ కేంద్రాలలో వెబ్‌క్యాస్టింగ్ కవర్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సామాన్యప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎన్నికల నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈవీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్, జడ్పీ సీఈఓ వైఖోమ్‌నిదియా, నగరపాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా గ్రామోత్సవం

గజవాహనంపై సీతారామ ఆంజనేయస్వామి ఊరేగింపు



గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 17: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీరామనవమి సందర్భంగా బుధవారం సాయంత్రం గజవాహనంపై సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం ఆలయ అవరణలో వేదపండితులు, అర్చకులు సీతారామచంద్ర స్వామి తిరుకల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం అర్చకులు గజవాహనాన్ని ప్రత్యేకంగా అలంకరించి, సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. అర్చకులు ఉత్సవమూర్తులకు పూజలు చేశారు. మేళతాళాల మధ్య స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ, ఏఈఓ, ధర్మకర్తల మండల చైర్మన్, సభ్యులు, ఆలయ అధికారులు, వేదపండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

చేపా చేపా.. ఎందుకు అమ్ముడుబోవు..?



యాడికి పట్టణంలోని చేపల మార్కెట్‌కు బుధవారం 15 కిలోల బరువున్న భారీ చేప వచ్చింది. దాన్ని చూసేందుకు జనం ఎగబడ్డారు. కానీ కొనేందుకు చాలాసేపు ఎవరూ ముందుకు రాలేదు. శ్రీరామ నవమి పండుగ కావడంతో చేపను అమ్మేందుకు వ్యాపారి తంటాలు పడ్డాడు. అదే ఆదివారం అయ్యుంటే.. పోటీ పడి కొనేవారు కదా..! పెద్దపప్పూరు మండలం పెండేకల్లు డ్యాంలో పెరిగిన చేప ఇది. వేటలో పట్టుబడటంతో అమ్మేందుకు యాడికి మార్కెట్‌కు తెచ్చారు. బొరస రకానికి చెందిన ఈ చేప.. చివరకు రూ.1,800కు అమ్ముడుపోయింది. ముగ్గురు స్నేహితులు ముచ్చటపడి దీన్ని కొని.. మోసుకువెళ్లారు.

- యాడికి

రేపు కణేకల్లుకు చంద్రబాబు

బస్టాండ్ సర్కిల్లో ప్రజాగళం సభ

అనంతపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం రాయదుర్గం నియోజకవర్గానికి వస్తున్నారు. ఈ నెల 19న కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో ప్రజాగళం పర్యటనను ముగించుకుని.. సాయంత్రం 4.50 గంటలకు హెలిక్యాప్టర్‌లో జిల్లాకు బయలుదేరుతారు. సాయంత్రం 5.10 గంటలకు కణేకల్లు క్రాస్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగుతారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 5.25 గంటలకు కణేకల్లు బస్టాండు సర్కిల్‌కు చేరుకుంటారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆ నియోజకవర్గ కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు నేతృత్వంలో ఏర్పాటు చేసిన ప్రజాగళం బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకూ బహిరంగ సభ కొనసాగనుంది. అనంతరం కణేకల్లు పట్టణంలోని శ్రీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో రాత్రికి బస చేస్తారు.

పరిశీలకులు వచ్చేశారు..

అనంతపురం టౌన్, ఏప్రిల్ 17: ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు, పార్టీల ఖర్చుల వ్యవహారాలను స్వయంగా పరిశీలించడానికి కేంద్ర ఎన్నికల కమిషన్ నియమించిన పరిశీలకులు ఐఆర్‌ఎస్ నితిన్ అగర్వాల్ అనంతకు చేరుకున్నారు. బుధవారం మధ్యాహ్నం ఆయన జిల్లా కురాగా పోలీస్‌గెస్ట్ హౌస్‌లో వసతి ఏర్పాటు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం కొద్ది సేపు జిల్లాలో ఎన్నికల నిర్వహణ, పార్టీలు, అభ్యర్థులు, కమిషన్ నిబంధనల అమలు తదితరవాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వివిధ ప్రాంతాలలో నేరుగా పర్యటించి వ్యయ వ్యవహారాలను పరిశీలించనున్నారు.



రాష్ట్రంలోనే హిందూపురం నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. నాటి బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో కల్లూరు సుబ్బారావు లాంటి ఎందరో యోధులు ఈ ప్రాంతం నుంచి పాల్గొన్నారు. కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దులో ఉన్న హిందూపురం ప్రాంతానికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి ఇక్కడ ఆ పార్టీకి తిరుగులేని విజయాలు అందించింది. ఈ నియోజవర్గంలో టీడీపీకి అపజయమే లేదు. ఎన్టీఆర్ నుంచి నందమూరి బాలకృష్ణ వరకూ ఈ ప్రాంత అభివృద్ధి కోసం చేసిన కృషి ఎనలేనిది.

- స్వాతంత్ర్యోద్యమంలో ప్రత్యేకత
- ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోనే ఎమ్మెల్యేలు
- తొలి ఎమ్మెల్యే శివశంకర్ రెడ్డి
- టీడీపీ ఆవిర్భావం నుంచి కంచుకోట
- ముఖ్యమంత్రి హోదాలో ఎన్టీఆర్
- పెన్నా, చిత్రావతి ఉన్నా.. నీటి కష్టాలే
- హంద్రీనీవాతో పునరుజ్జీవం
- గొల్లపల్లితో తాగునీటి సమస్య పరిష్కారం



లేపాక్షిలో జటాయువు

నియోజకవర్గ చరిత్ర


పోరాట పురం

హిందూపురం

భారత స్వాతంత్ర్య పోరాటంలో హిందూపురం ప్రాంతానికి ప్రత్యేక స్థానం ఉంది. మహాత్మాగాంధీ పిలుపుతో ఎంతో మంది యువకులు స్వాతంత్ర్యం కోసం పాటుపడ్డారు. ఈ పోరాటంలో రాయలసీమ నుంచి ముఖ్యంగా విని పించే పేరు కల్లూరు సుబ్బారావు. ఇంతటి మహోన్నత వ్యక్తి హిందూపురం నుంచి 1955లో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో అడుగు పెట్టారు. బ్రిటీష్ పాలనలోనే హిందూపురం తాలూకాగా ఏర్పడింది. హిందూరావు అనే పాలకుడి నుంచి హిందూపురం పేరు వచ్చింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంగా ఉన్న సమయంలోనే 1937, 1946లో ఎన్నికలు జరుగగా కాంగ్రెస్ పార్టీ నుంచి డి. కదిరప్ప, కల్లూరు సుబ్బారావు శాసన సభ్యులుగా ఎన్నికయ్యారు. పురం వాణిజ్య కేంద్రంతోపాటు కర్ణాటక సరిహద్దులో ఉండడంతో ఎక్కువ భాగం ఆ సంస్కృతి కనిపిస్తుంది.

మద్రాసు రాష్ట్రంలోనే పురం నుంచి శాసనసభ్యులు

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 1937, 1946లో హిందూపురం నుంచి శాసన సభ్యులుగా డి.కదిరెప్ప, కల్లూరు సుబ్బారావు ప్రాతినిధ్యం వహించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నియోజక వర్గం ఏర్పడిన 1952లో తొలి సారిగా స్వతంత్ర్య అభ్యర్థిగా శివశంకర్‌రెడ్డి గెలుపొందారు. 1957లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర సమర యోదుడు కల్లూరు సుబ్బారావు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నియోజకవర్గంలో హిందూపురం మున్సిపాలిటితోపాటు లేపాక్షి, చిలమత్తూరు మండలాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి.


కల్లూరు సుబ్బారావు

తెలుగుదేశం పార్టీకి కంచుకోట



తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి హిందూపురం అసెంబ్లీ స్థానం కంచుకోటగా నిలుస్తోంది. టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు రెండుసార్లు ముఖ్యమంత్రిగా ఒకసారి ప్రతిపక్ష నాయకుడిగా ఇక్కడి నుంచే ప్రాతినిధ్యం వహించారు. 1983 నుంచి 2019 వరకు టీడీపీ అభ్యర్థులే గెలుస్తున్నారు. హిందూపురం మున్సిపాటిలో టీడీపీ రెండు సార్లు మినహా గెలవలేకపోయినా ఎమ్మెల్యే ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీ అభ్యర్థులే గెలుస్తున్నారు. ఆరుసార్లు నందమూరి వంశానికి చెందిన వారే గెలిచారు ఇందులో మూడు సార్లు ఎన్టీఆర్, ఆయన తనయులు హరికృష్ణ ఒకసారి ప్రాతినిధ్యం వహించగా, ప్రస్తుతం నందమూరి బాలకృష్ణ రెండోసారి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.


లేపాక్షి నంది విగ్రహం

చారిత్రాత్మక, పర్యాటక ప్రదేశాలు

హిందూపురం నియోజకవర్గంలో పలు చారిత్రాత్మక, పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వీటిలో ప్రపంచ శిల్పకళా క్షేత్రం లేపాక్షి, భారతదేశంలోనే చలివెందులలో అతి పెద్ద శాసనం, కొడికొండ కోట, కనుమ లక్ష్మీనరసింహస్వామి, పేట వెంకటరమణస్వామి ఆలయం, సూగూరు ఆంజనేయస్వామి ఆలయం, అనంత పద్మనాభ ఆలయం, వలస పక్షుల విడిది వీరాపురం ముఖ్యమైనవి.

సంవత్సరం	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	ఆధిక్యం
2019	నందమూరి బాలకృష్ణ	టీడీపీ	షేక్ మహ్మద్ ఇక్బాల్	వైసీపీ	17,028
2014	నందమూరి బాలకృష్ణ	టీడీపీ	బి. నవీన్‌నిశ్చల్	వైసీపీ	16,196
2009	అబ్దుల్ ఘనీ	టీడీపీ	బి. నవీన్‌నిశ్చల్	ఇండిపెండెంట్	8,764
2004	రంగనాయకులు	టీడీపీ	బి.నవీన్‌నిశ్చల్	కాంగ్రెస్	7,363
1999	సీసీ వెంకటరాముడు	టీడీపీ	కె.తిప్పేస్వామి	కాంగ్రెస్	38,391
1996	నందమూరి హరికృష్ణ	టీడీపీ	లక్ష్మీనారాయణరెడ్డి	కాంగ్రెస్	58,210
1994	ఎన్టీ రామారావు	టీడీపీ	జేసీ ప్రభాకర్‌రెడ్డి	కాంగ్రెస్	60,050
1989	ఎన్టీ రామారావు	టీడీపీ	జి. సోమశేఖర్	కాంగ్రెస్	23,995
1985	ఎన్టీ రామారావు	టీడీపీ	ఈ. ఆదిమూర్తి	కాంగ్రెస్	40,529
1983	రంగనాయకులు	టీడీపీ	కె. తిప్పేస్వామి	కాంగ్రెస్	26,855
1978	కె. తిప్పేస్వామి	కాంగ్రెస్ ఐ	నాగభూషణ్‌రెడ్డి	జేఎన్‌పీ	21,360
1972.	జి. సోమశేఖర్	కాంగ్రెస్	తంబి వెంకటరత్నం	బీజేఎస్	21,840
1967	కాట్నగంటి	ఇండిపెండెంట్	కెఆర్‌హెచ్ రెడ్డి	కాంగ్రెస్	2,326
1965	కేఎస్ రావు	కాంగ్రెస్	ఆర్. దాసా	ఇండిపెండెంట్	4,614
1962	కె. రామక్రిష్ణారెడ్డి	ఐఎన్‌డీ	కల్లూరు సుబ్బారావు	కాంగ్రెస్	8,759
1957	కల్లూరు సుబ్బారావు	కాంగ్రెస్	రుక్మిణీదేవి	ఐఎన్‌సీ	2,849
1952	శివశంకర్‌రెడ్డి	స్వతంత్ర			

యువ ఓటర్లే కీలకం



రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు కల్గిన హిందూపురంలో యువ ఓటర్లే కీలకంగా ఉన్నారు. నియోజకవర్గంలో 2,48,137 మంది ఓటర్లు ఉండగా మహిళలు 1,23,899, పురుషులు 1,24,219, ఇతరులు 19 మంది ఉన్నారు. ఇందులో 18 నుంచి 19 ఏళ్ల వయస్సు కల్గిన 4,666 మంది ఓటర్లు, 20నుంచి29 వయసు వారు 43,295 మంది, 30నుంచి39 వయసు వారు 65,951 మంది, 40 నుంచి 49 మధ్య 55,916 మంది, 50నుంచి59 వరకు 38,737 మంది, 60నుంచి69 మధ్య 23,926 మంది, 70నుంచి79 మధ్య 12,098 మంది, 80నుంచి89 మధ్య 3,278 మంది, 90నుచి99 మధ్య వయసు కలిగిన వారు 467 మంది ఉన్నారు. ఇందులో ప్రధానంగా యవత, మధ్య వయస్సు కల్గిన ఓటర్లే అత్యధికంగా ఉన్నారు. ఇక్కడి అభ్యర్థుల భవితవ్యం నిర్ణయించడంలో యువ ఓటర్లే కీలకం కానున్నారు.

పరిశ్రమలు, వ్యవసాయమే జీవనాధారం



హిందూపురం నియోజకవర్గం కర్ణాటక సరిహద్దులో ఉంది. ప్రధానంగా అటు పెన్నా, ఇటు చిత్రావతి మధ్యలో జయమంగళి, కుషావతి నదులు ఉన్నా తాగు, సాగు నీటి కష్టాలు ఉన్నాయి. రెండు దశాబ్దాల కిందట నదుల్లో పుష్కలంగా నీరు ప్రవహిస్తున్న నేపథ్యంలో పాడిపంటలు కనుచూపుల మేర కలిపించేవి. ఏడాది పొడవునా భారీగా పంటల సాగు వల్ల పరిగి వద్ద చెరకు పరిశ్రమ కూడా ఏర్పాటు చేశారు. తీవ్ర వర్షాభావంతో నదులు ఎండిపోవడంతో హిందూపురానికి సూపర్‌స్పిన్నింగ్ మిల్లుల రాకతో పరిశ్రమలకు బీజం పడి 1985లో ఎన్టీఆర్ తూమకుంట పారిశ్రామిక వాడకు శ్రీకారంతో దేశంలో అగ్రగామి వాడగా గుర్తింపు వచ్చింది. పారిశ్రామిక వాడలో 150కుపైగా పరిశ్రమలతోపాటు గార్మెంట్స్, పవర్‌లూమ్స్ పరిశ్రమలు నిర్మాణంతో సగటున 50 వేల మందికి ఉపాధి లభిస్తోంది. వీటితో ఇక్కడ ఉన్న చింతపండు, మిర్చి మార్కెట్లు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ఇక్కడి నుంచి చింతపండు, మిర్చి దేశవిదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. పట్టుపరిశ్రమకు అనుకూలమైన ప్రాంతం కావడంతో ప్రతి గ్రామంలో పట్టుపండించే రైతులు కనిపిస్తారు.

నియోజకవర్గ విస్తీర్ణం

హిందూపురం పట్టణంతోపాటు హిందూపురం మండలం, లేపాక్షి, చిలమత్తూరు మండలాలు ఉన్నాయి. మొత్తం విస్తీర్ణం 54,389హెక్టార్లు కాగా ప్రస్తుత జనాభా 3,55,146 ఇందులో పురుషులు 1,79,192, మహిళలు 1,75,954 మంది ఉన్నారు.

ఓటర్ల వివరాలు

హిందూపురంలో పురుషులు 55,483, మహిళలు 53,874, ఇతరులు 9మంది ఉన్నారు. లేపాక్షిలో పురుషులు 16,593, మహిళలు 15,922, చిలమత్తూరులో పురుషులు 20,014, మహిళలు 19,487, ఇతరులు 1 మొత్తం ఓటర్లు 2,19,012 మంది ఉన్నారు. నియోజక వర్గంలో మొత్తం పోలింగ్ స్టేషన్లు 256 ఉన్నాయి.

గొల్లపల్లితో నీటి సమస్యకు చెక్

దశాబ్దాలకాలంగా హిందూపురంలో తాగునీటి సమస్య వెంటాడేది. తర్వాత రూ. 650కోట్లు వెచ్చించి శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా హిందూపురానికి నీటిని తీసుకొచ్చారు. కానీ నాసిరకం పైపులు కావడంతో తరచూ నీటి సమస్య అలాగే ఉండేది. ఈ పరిస్థితుల్లో 2018వరకు గుక్కెడు నీటి కోసం పుర ప్రజలు రోడ్లెక్కేవారు. ఈ సమస్యను కళ్లారా చూసినా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చెప్పి కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ద్వారా నిధులను తీసుకొచ్చి గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి రూ.194కోట్లు వెచ్చించి ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా హిందూపురానికి నీరు తీసుకొచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా ఇక్కడ నీటి సమస్యకు చెక్‌పడింది. దీంతో దశాబ్దాల నీటి సమస్యకు తెలుగుదేశం పార్టీ పరిష్కార మార్గం చూపింది.

పెన్నా, చిత్రావతి ఉన్నా.. నీటి కష్టాలే


పురం మార్కెట్‌లో చింతపండు

హిందూపురం నియోజకవర్గం కర్ణాటక సరిహద్దులో ఉంది. ప్రధానంగా అటు పెన్నా, ఇటు చిత్రావతి మధ్యలో జయమంగళి, కుషావతి నదులు ఉన్నా తాగు, సాగు నీటి కష్టాలు ఉన్నాయి. వెయ్యి అడుగుల లోతులో బోరు బావి తవ్వినా నీటి చెమ్మదొరకని పరిస్థితి ఉంది. హిందూపురం పట్టణంలో గత పదేళ్లుగా పొదుపుగా వాడుకోవాల్సి వస్తోంది. తాగు, సాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం హంద్రీనీవా మడకశిర ఉప కాలువతో లేపాక్షి, హిందూపురం మండలాల్లో చెరువులను కృష్ణా జలాలతో నింపుతున్న నేపథ్యంలో సాగు,తాగు నీటి కష్టాలు కొన్ని గ్రామాల్లో పరిష్కారం దిశగా వస్తోంది. చిలమత్తూరు మండలం అంతటా గుక్కెడు తాగునీటి కోసం అగచాట్లు పడాల్సివస్తోంది. చిలమత్తూరు మండలంలో పరిశ్రమల కోసం రైతుల నుంచి 8,844 ఎకరాలను తీసుకున్న భూముల్లో 15 ఏళ్లుగా పరిశ్రమలు ఏర్పాటు కాకపోగా భూములు ఇచ్చిన రైతులు వలస కడుతున్నారు. హిందూపురంలో ఇరుకు రహదారుల వల్ల భారీ ట్రాఫిక్‌తో అంతరాయం వల్ల చుట్టూ రింగ్‌రోడ్ నిర్మించాల్సి ఉంది. పారిశ్రామిక వాడలో మూతపడిన పరిశ్రమలను పునఃప్రారంభించి స్థానికులకు ఉపాధి అవకాలు ఇవ్వాలనే డిమాండ్లు ఉన్నాయి.

ప్రధాన సంస్థలు

విద్య, వైద్యం, పరిశ్రమలు, వాణిజ్య మార్కెట్లతోపాటు తూమకుంట, గోళ్లాపురం పారిశ్రామికవాడ, నవోదయ విద్యాలయం, గురుకుల పాఠశాలలు, తెలుగు చేనేత శిక్షణ కేంద్రం, కిరికెర పట్టుపరిశోధన ఉత్పత్తి కేంద్రం ఉన్నాయి.



● సరదా సిత్రం

ఈ ఫొటోలో ఉన్నది ధర్మవరం కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్, తాడిపత్రికి చెందిన టీడీపీ నాయకుడు ప్రసాద్. సత్యకుమార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ధర్మవరంలో పర్యటించారు. ప్రసాద్ కూడా ఆయన వెంట ప్రచారంలో పాల్గొన్నారు. సిద్దయ్యగుట్ట ప్రాంతంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద 'అన్నా.. నాతో సెల్ఫీ దిగండి..' అని సత్య కుమార్‌ను ప్రసాద్ కోరారు. దీంతో 6.7 అడుగుల ఎత్తున్న ప్రసాద్‌ను సత్య కుమార్ ఎగాదిగా చూశారు. 'నీ ఎత్తుకు సరిపోయేలా ఫొటో దిగాలంటే... జెస్ట్ వెయిట్..' అంటూ నవ్వుతూ కారు స్టాండుపై నిలబడ్డారు. అలా ప్రసాద్‌తో సత్యకుమార్ ఫొటో దిగారు. ఈ సన్నివేశాన్ని చూసి అక్కడున్న వారంతా సరదాగా నవ్వుకున్నారు.

- ధర్మవరం



● సెంటిమెంటు..!

అనగనగా ఒక ఊరు..!


గంగమ్మ ఆలయం

ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించే సమయంలో చాలామంది మంచి ముహూర్తం చూసుకుంటారు. అచ్చొచ్చిన ఊరు, ఆలయం, సెంటర్.. ఇలా ఏదో ఒకటి ఎంచుకుంటారు. అలాంటి ప్రాంతాల్లో ఒకటి.. చెన్నేకొత్తపల్లి మండలంలోని గొల్లవాండ్లపల్లి గ్రామం. ఈ ఊరి నుంచి ప్రచారం ప్రారంభిస్తే ఎన్నికల్లో కలిసొస్తుందని దశాబ్దాలుగా ప్రధాన పార్టీల అభ్యర్థులు విశ్వసిస్తున్నారు. అప్పట్లో పెనుకొండ నియోజకవర్గంలో ఉన్న ఈ ఊరు.. ప్రస్తుతం రాప్తాడు నియోజక వర్గంలో ఉంది. ఇప్పటికీ ఎన్నికల సెంటిమెంట్ కొనసాగుతోంది. అసెంబ్లీ బరిలో నిలిచే అభ్యర్థులు గ్రామంలో వెలసిన గంగమ్మ దేవతను దర్శించుకుని, పూజలు నిర్వహించుకుని ప్రచారాన్ని మొదలు పెడతారు. చెన్నేకొత్తపల్లి మండలంలో.. ఈశాన్య మూలలో(దేవుని మూల) ఈ ఊరు ఉండటం కూడా సెంటిమెంట్‌కు కారణమని ఆ ఊరి పెద్దలు చెబుతున్నారు.

- చెన్నేకొత్తపల్లి

రేపు బాలయ్య నామినేషన్



హిందూపురం, ఏప్రిల్ 17: టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి హిందూపురం అభ్యర్థి నందమూరి బాలకృష్ణ ఈనెల 19న నామినేషన్ వేయనున్నారు. 19న మధ్యాహ్నం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నామినేషన్ దాఖలు చేస్తారని టీడీపీ వర్గాలు తెలిపాయి. అదే రోజు సాయంత్రం 4 గంటలకు సూగూరు ఆంజనేయస్వామి ఆలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ చేయనున్నారు.

శ్రీసత్యసాయి జిల్లాకు ముగ్గురు వ్యయపరిశీలకులు

పుట్టపర్తి, ఏప్రిల్ 17: జిల్లాలో ఎన్నికల వ్యయాలను పరిశీలించేందుకు ముగ్గురు అధికారుల బృందం వచ్చినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. హిందూపురం పార్లమెంటుకు అమిత్‌కుమార్, మడకశిర, హిందూపురం, పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గాలకు వినాయక్, పుట్టపర్తి, ధర్మవరం, కదిరికి శ్రీరిదయం బహందజా వ్యయ పరిశీలకులుగా వ్యవహరించనున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

హిందూపురం/అనంతపురం క్రైం, ఏప్రిల్ 17: ఎన్నికల నేపథ్యంలో సెబ్ అధికారులు, పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లేపాక్షి మండలం కంచిసముద్రం వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఇన్నోవాలో 30 బాక్సుల కర్ణాటక మద్యం పట్టుబడింది. మద్యం, కారును సీజ్ చేసి చేశారు. మద్యాన్ని తరలిస్తున్న సోమందేపల్లి మండలం పందిపర్తికి చెందిన ఇమాంసాహెబ్, యల్లప్పగారి రామాంజినేయులును అరెస్ట్ చేశారు.

- హిందూపురం నుంచి మానెంపల్లికి వెళ్లే రహదారిలో బైక్‌పై తరలిస్తున్న ఐదు కర్ణాటక మద్యం బాక్సులను సీజ్ చేశారు. హిందూపురానికి చెందిన బాబు అనే వ్యక్తిని అరెస్టు చేశామని సెబ్ అదనపు ఎస్పీ నాగభూషణం తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ సీఐ రాజశేఖర్‌గౌడ్, ఎస్‌ఐలు కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు.
- అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు బుధవారం రూ.9.25లక్షల నగదును సీజ్ చేశారు. 44వ నంబరు జాతీయ రహదారిపై.. రవి పెట్రోల్ బంక్ వద్ద సీఐ ప్రతాప్‌రెడ్డి సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారి ప్రశాంత్ నుంచి రూ.9.25 లక్షల ఆధారాలు లేని నగదును స్వాధీనం చేసుకుని.. సీజ్ చేశారు.

అంతా రెడీ!

- నామినేషన్ల ఘట్టానికి ఏర్పాట్లు పూర్తి
- నేటి నుంచి 25వరకు నామినేషన్ల స్వీకరణ
- ఎంపీ అభ్యర్థులకు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు
- అసెంబ్లీలకు ఆయా నియోజకవర్గాలలో నామినేషన్లు
- మూడు వాహనాలు, ఐదుగురికే అనుమతి
- దరఖాస్తుకు డాక్యుమెంట్లు తప్పనిసరి

అనంతపురంటౌన్/ ఉరవకొండ, ఏప్రిల్ 17

పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది. పబ్లిక్ హాలిడేస్ మినహా మిగిలిన రోజులలో ఈనెల 25వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ల కార్యక్రమానికి జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. అనంతపురం జిల్లాలో ఒకపార్లమెంటు, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఎంపీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు నుంచి కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఆయా నియోజకవర్గ కేంద్రాలలో నామినేషన్లు స్వీకరిస్తారు. ఎంపీ అభ్యర్థుల నుంచి నామినేషన్లను ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టరు స్వీకరిస్తారు. ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి ఆయా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నామినేషన్లను స్వీకరిస్తారు. ప్రతి రోజు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మాత్రమే నామినేషన్లు స్వీకరిస్తారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ, మే 13న పోలింగ్ ఉంటుంది. జూన్ 4న కౌంటింగ్ పక్రియ కొనసాగుతోంది. ప్రతి అభ్యర్థి ఎన్నికల్లో రూ.40లక్షలకు మించి ఖర్చు పెట్టనని డిక్లరేషన్ ఇవ్వాలి. నామినేషన్ దాఖలు కేంద్రానికి 100 మీటర్ల దూరం లోనే ర్యాలీలు, ప్రదర్శనలు ఆపేయాలి.

అభ్యర్థులూ..! జాగ్రత్త

భారత ఎన్నికల సంఘం నామినేషన్ దాఖలకు మార్గదర్శకాలు జారీ చేసింది అభ్యర్థులు నామినేషన్ పత్రాల్లో అడిగిన సమాచారాన్ని పూరించాలి. ఆస్తుల వివరాలు, నేరచరిత్ర, కేసులు, ఇతర వివరాల సమాచారాన్ని జాగ్రత్తగా నింపాలి.

డాక్యుమెంట్లు తప్పనిసరి

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నామినేషన్లు వేసే అభ్యర్థులు 13రకాల డాక్యుమెంట్లును దరఖాస్తుకు జత చేయాల్సి ఉంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు చెప్పిన మేరకు డాక్యుమెంట్లు ఇలా ఉండాలి.

- పార్లమెంటు ఎన్నికలకు పోటీ చేసే వ్యక్తి భారతదేశ పౌరుడై ఉండాలి. అసెంబ్లీకి పోటీ చేసే వ్యక్తి రాష్ట్ర పౌరుడై ఉండాలి.
- ఎంపీ అభ్యర్థి దేశంలో ఎక్కడైనా పార్లమెంటు పరిధిలో ఓటరుగా నమోదై ఉండాలి, అసెంబ్లీ అభ్యర్థి రాష్ట్రంలో ఎక్కడైనా ఓటరుగా నమోదై ఉండాలి
- పోటీ చేసే అభ్యర్థులకు కనీస వయసు 25 ఏళ్లు ఉండాలి
- పార్లమెంటు అభ్యర్థులు ఫారం-2ఏ, అసెంబ్లీ అభ్యర్థుల ఫారం-2బీ నామినేషన్ పత్రాలు ఇవ్వాలి
- ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మాత్రమే నామినేషన్లు వేయాల్సి ఉంటుంది. ప్రతి అభ్యర్థి నాలుగు సెట్లు దాఖలు చేయవచ్చు. నేరుగా వచ్చి నామినేషన్లు వేయవచ్చు. లేకుంటే ఆన్‌లైన్‌లో సువిధ పోర్టల్ ద్వారా కూడా నామినేషన్లు దాఖలు చేయవచ్చు.
- అఫిడవిట్ ఫారం-26, ఓటరుకార్డురోల్ నెంబరు, ఫారం-ఏ,బీ, కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి
- ఎంపీ అభ్యర్థులైతే రూ25,000, ఎమ్మెల్యే అభ్యర్థులైతే రూ.10వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది.

నామినేషన్ల సందర్భంగా భారీ భద్రత

నామినేషన్ల పక్రియ ప్రారంభమవుతుండటంతో జిల్లా ఎన్నికల ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. అభ్యర్థులు నామినేషన్లు వేసే సందర్భంలో పాటించాల్సిన నిబంధనల గురించి ఇప్పటికే కలెక్టరు, ఎస్పీ, ఆర్‌ఓలు వివరించారు. నామినేషన్లు స్వీకరించే కార్యాలయాల వద్ద 144 సెక్షన్ ప్రకటించి, అక్కడ ప్రత్యేక పోలీస్ బల గాలను ఏర్పాటు చేశారు. నామినేషన్ల పక్రియను ఎన్నికల కమిషన్ పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా లైవ్ ఏర్పాటు చేశారు. పోటీ చేసే అభ్యర్థి మూడు వాహనాలలో మాత్రమే ఆర్‌ఓ కార్యాలయంలోకి రావడానికి అనుమతి ఉంది. అలాగే అభ్యర్థితో పాటు మరో నలుగురు మాత్రమే ఆర్‌ఓ కార్యాలయంలోకి వెళ్ల డానికి అనుమతి ఉంటుంది.

నియోజకవర్గం, నామినేషన్లు స్వీకరించే ప్రాంతం, రిటర్నింగ్ ఆఫీసర్, ఫోన్ నెంబరు			
రాయదుర్గం	తహసీల్దార్ కార్యాలయం	కరుణకుమారి	98499 09062
గుంతకల్లు	ఆర్డీఓ కార్యాలయం	శ్రీనివాసులురెడ్డి	98493 99611
ఉరవకొండ	తహసీల్దార్ కార్యాలయం	కేతన్‌గార్గ్	94931 88811
తాడిపత్రి	తహసీల్దార్ కార్యాలయం	రాంభూపాల్ రెడ్డి	6301228661
శింగనమల	తహసీల్దార్ కార్యాలయం	వెన్నెల శ్రీను	94942 14212
అనంతపురం	ఆర్డీఓ కార్యాలయం	గ్రంధి వెంకటేష్	94931 88807
కళ్యాణదుర్గం	ఆర్డీఓ కార్యాలయం	రాణిసుష్మిత	83330 82895
రాప్తాడు	తహసీల్దార్ కార్యాలయం	వసంతబాబు	94905 17883

నామినేషన్లకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 17: లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి గురువారం నుంచి ఈనెల 25వరకు చేపట్టే నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు గెజిట్ నోటిఫికేషన్ గురువారం విడుదల చేస్తామని అన్నారు. జిల్లాలోని లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాలకు నామినేషన్లు స్వీకరిస్తామని అన్నారు. ఎక్కడా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నామినేషన్ల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. ప్రతి కేంద్రం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ఇతరులను లోపలికి రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. నామినేషన్లు వేయడానికి వచ్చే అభ్యర్థులకు అన్ని అంశాలను వివరించాలని సూచించారు. అభ్యర్థులు నామినేషన్ల పత్రాలు నింపడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లో లోక్‌సభ అభ్యర్థుల నామినేషన్ల ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, అడిషనల్ ఎస్పీ విజయభాస్కరరెడ్డి, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, డీఎస్పీ వీరరాఘవరెడ్డి, కలెక్టరేట్ ఏఓ అంజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరం బస్టాండ్‌లో ఉన్న ఆర్టీసీ బస్సులు

వామ్మో..! ఆర్టీసీ బస్సా!

వైసీపీ పాలనలో చార్జీల మోత

- బస్సెక్కేందుకు జంకుతున్న జనాలు
- పేద, మధ్యతరగతి వర్గాలపై తీవ్ర ప్రభావం
- అధికారపార్టీపై సామాన్యుల ఆగ్రహం



ప్రయాణీకులపై భారం ఇలా..

శ్రీసత్యసాయి జిల్లాలో ధర్మవరం డిపో నుంచి అనంతపురానికి చార్జీ 2019లో రూ.45 ఉండగా ప్రస్తుతం రూ.60, గోరంట్లకు 2019లో రూ.55 ఉండగా ప్రస్తుతం రూ.60, కర్నూలుకు 2019లో రూ.105 ఉండగా ప్రస్తుతం రూ.125, తిరుపతికి 2019లో రూ.490 ఉండగా ప్రస్తుతం రూ.530కి పెంచేశారు.

ధర్మవరం: వైసీపీ పాలనలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం భారంగా మారింది. ఐదేళ్ల పాలనలో రెండుసార్లు చార్జీలు పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్టీసీ బస్సెక్కాలంటే భయపడే పరిస్థితి నెల కొంది. 2019లో పోల్చితే పల్లె వెలుగుల బస్సుల నుంచి లగ్జరీ, ఎక్స్‌ప్రెస్‌ల వరకు బస్సు చార్జీలు 20శాతం పెరిగాయి. శ్రీసత్యసాయి జిల్లాలో దాదాపు 500 బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. వీటి ద్వారా ఆర్టీసీకి రోజు రూ.50లక్షలు నుంచి రూ.60లక్షల దాకా ఆదాయం సమకూరుతోంది. రాష్ట్ర విభజన తరువాత టీడీపీ అధికారంలోకి ఉన్న ఐదేళ్లలో ఆర్టీసీ చార్జీలను పెంచలేదు. నిత్యావసర సరుకుల ధరలతో పాటు ఆర్టీసీ చార్జీలు విపరీతంగా పెరగడంతో వైసీపీ పాలనపై సామాన్యుడు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు.



పెంపుపై సామాన్యుల ఆగ్రహం

ఆర్టీసీ బస్సు చార్జీలను ఐదేళ్లలో రెండు సార్లు పెంచడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది. కూలీలు, ప్రైవేటు ఉద్యోగులు, వివిధ వృత్తుల్లో ఉన్న చాలామంది అద్దెలు తక్కువగా ఉంటాయనే భావనతో గ్రామాల్లో నివసిస్తుంటా రు. వారంతా పనుల కోసం వివిధ ప్రాంతాలకు నిత్యం బస్సుల లోనే ప్రయాణిస్తుంటారు. వచ్చే కూలి/వేతనం ఎక్కువ మొత్తం బస్సు చార్జీలకే పోతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భారంగా బస్సు ప్రయాణం

రిపేరీ వస్తువుల కొనుగోలు కోసం అనంతపురం, ఇతర ప్రాంతాలకు ప్రతి రోజు వెళ్లే వాళ్లం. అప్పట్లో చార్జీలు తక్కువగా ఉండటం వల్ల మాకు బాగుండేది. టీడీపీ హయాంలో ఆర్టీసీ చార్జీలను పెంచలేదు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక రెండు సార్లు చార్జీలు పెంచింది. దీని వల్ల బస్సు ప్రయాణం భారంగా మారింది. అందువల్ల ప్రయాణాలు తగ్గించుకున్నాం.

- రియాజ్‌బాషా, మెకానిక్, ముదిగుబ్బ



ఆర్టీసీ చార్జీలను ప్రభుత్వం పెంచుతూ పోతే ప్రయాణాలను మానుకోవాల్సిందే. ఆర్టీసీ బస్సులలో ప్రయాణం సురక్షితంగా ఉంటుందని బావిస్తున్నాం. అయితే చార్జీలను పెంచడం వల్ల కొందరు సొంత వాహనాలలో వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు. ఆ ప్రయాణాలు ప్రమాదాలకు దారితీస్తాయి. ఏ ప్రభుత్వమైనా ఆర్టీసీ చార్జీలు పెంచే ఆలోచన చేయకపోతే బాగుంటుంది.

- నాగేంద్ర, ఏలుకుంట్ల, ధర్మవరం మండలం

ఓటుకు ఉపాధి కూలి!

తమ వైపు తిప్పుకునేందుకు వైసీపీ నాయకుల పన్నాగం

- ఉపాధి పనులు చేయకనే కూలి ఇప్పించే యత్నం
- ఉపాధి కార్యాలయంలో ప్రత్యేక టీం ఏర్పాటు
- మండలానికి చెందిన ఓ టీఏకి బాధ్యతల అప్పగింత




విడపనకల్లు: ఓటర్లను తమ వైపు తిప్పుకోవడానికి వైసీపీ నేతలు అడ్డదారులు తొక్కుతున్నారు. ఇందులో భాగంగా మండలంలోని పెద్ద పంచాయతీ లలో వైసీపీకి అనుకూలమైన వారు ఉపాధి పనులకు వెళ్లకున్నా కూలి డబ్బులు వేయించేందుకు ఓ టీంను ఏర్పాటు చేసినట్లు సమాచారం. పాల్తూరులో దాదాపుగా 7046పైగా ఓటర్లు ఉన్నారు. హావళిగి గ్రామంలో 6800, ఆర్ కొట్టాలలో 850 మంది ఓటర్లు ఉన్నారు. ఈ గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేయకున్నా కూలీలకు బిల్లులు పెటించేందుకు ఓ టీంను ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఈ గ్రామాలకు ఓ టీఏ(టెక్నికల్ అసిస్టెంట్‌ను) నియమించారు. విడపనకల్లుకు చెందిన ఓ టీఏని టీం లీడర్‌గా ఏర్పాటు చేసి గుట్టు చప్పుడు కాకుండా రోజు కొంత మందిని ఆన్‌లైన్‌లోకి ఎక్కించే ఏర్పాట్లు చేశారనే చర్చ సాగుతోంది. ఆర్ కొట్టాల, పాల్తూరు, హావళిగి, వేల్పుమడుగు గ్రామల్లో వైసీపీ సానుభూతిపరులందరికి ఉపాధి హామీ బిల్లులు పెట్టించేందుకు కింది స్థాయి నుంచి పై స్థాయి వరకూ టీంవర్కు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే పాల్తూరు, ఆర్ కొట్టాల గ్రామాల్లో పనులకు వెళ్లకున్నా కొందరికి బిల్లులు పెట్టారని తెలిసింది.

మాట వినకుంటే వేటే!

వైసీపీ నేతలు మాటలు వినని ఓ అధికారిని తప్పించి ఆ స్థానంలో వేరొక అధికారిని ఏర్పాటు చేసి బిల్లులు చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసింది. పనులు చేయకుండానే బిల్లులు ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు ఒప్పుకునే ప్రసక్తేలేదని ఆ అధికారి తెగేసి చెప్పారని సమాచారం. ఉన్నతస్థాయి అధికారులు పనులు పరిశీలనకు వస్తే చేయని పనులు ఎక్కడ చూపించాలని ఆ అధికారి ప్రశ్నించగా వారు వచ్చే సమయానికి ఎక్స్‌కవేటర్లతో కొన్ని చోట్ల పనులు చేయించి కూలీలతో చేయించినట్లు చూపించే ఏర్పాట్లు చేస్తామని ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. మండలానికి చెందిన ఓ వైసీపీ నేత ఆ అధికారిని తన వద్దకు పిలిపించుకుని మేం చెప్పినట్లు వినకపోతే మా మండలం నుంచి వెళ్లి పోవాలని హుకుం జారీ చేసినట్లు అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది.

• లెక్క పీక్కున్నారంట రోయ్..!



"శిష్యా.. పేపర్లు తిప్పేసినావా..? ఫేస్‌బుక్కు, వాట్సాపు.. ఇన్‌స్టా గెలికేసినావా..? ఈ పొద్దు ఇశేషాలు ఏమైనా ఉండాయా..?"

"విశేషాలు ఏమీ లేవు గురూ.. అన్నీ అవశేషాలే..! ఎలెచ్చన్లు తప్ప ఏంటీవీ లేవు. మండే ఎండలు ఒగపక్క.. నాయకుల పవారాలు ఇంగోపక్క..! బయిటికి అడుగు పెడితే తిరనాల ఉన్నెట్లుంది గురూ..!"

"ఇవి మామూలేగదా శిష్యా.. ఇంతకీ జనం ఏమంటాండారు..?"

"జనం ఏమంటారు పాపం..? రోంత ఇబ్బందిగానే ఉంది వాళ్ల పరిచ్చితి. యాపారానికో అవసరానికో బంగారు, దుడ్డు తీసకపోతాన్యా పోలీసోళ్లు పట్టుకుంటాండారు. ఓటర్లకి ఇచ్చేకి కాదు సార్.. ఇవి మా అవసరాలకు అన్యా ఇనిపించుకోడంలేదు గురూ.."

"ఆధారాలు ఎంట పెట్టుకోల్ల ముందుగానే చెప్పినారు కదా శిష్యా..? లెక్క దండిగుందని ఊరికే ఊగలాడుకుంట ఎంట పెట్టుకోని పోతే పట్టుకోకుండ ఏంజేత్తారు..? ఇంతకీ ఎవురెవురి దెగ్గిర లెక్క, బంగారం పీక్కున్నారు..?"

ఏంది గురూ..!

"గురూ.. విడపనకల్లు కర్నాటక సరిహద్దు చెక్ పోస్టు దెగ్గిర మంగలారం అర్ధరాత్తిరి ఫ్లయింగు స్క్వాడు అధికారులు, ఎస్సయ్య ఇమామ్ ఖాసీం ఇద్దర్ని పట్టుకున్నారు. కారులో 11 కేజీలకి పైగా వెండి, 20 తులాలకి పైగా బంగారు, నాలుగున్నర లచ్చల దుడ్లు ఉన్యాయి. యాట్నుంచి తెస్తాండారు..? ఎవురివి ఇవి అంటే ఏమీ చెప్పలేకపోయినారంట. సాదిక్, డేవిడ్ అంట వాళ్ల పేర్లు. బళ్లారి నుంచి కారులో ఉరవకొండకు ఒత్తాంటే పట్టుకున్నారు. టైం బాగలేదు పాపం.."

"దిగులు పడొద్దు శిష్యా.. మళ్లీ ఆధారాలు సూపిత్తే ఎనిక్కి ఇత్తారులే. సిరుగుప్ప నుంచి శీకలస్తికి పోతాండే ఇద్దర్ని గుడక పట్టుకున్నారంట గదా..? రెండు లచ్చలా అరవై ఏడు వేలు ఉన్యాదంట వాళ్ల దెగ్గిర. మన నింబగల్లు పిల్లోడు గుడక రెండు లచ్చలు తీసకపోతాంటే పట్టుకున్నారంట.."

"ఊను గురూ.. నార్పల క్రాస్ దెగ్గిర ఎస్సయ్య రాచ్చేకర్రెడ్డి, ఇంగో అధికారి రవీంద్రరెడ్డి కలిసి గోపాల్, సాంబశివుడు అనేటోళ్ల దెగ్గిర రూ.2,84,800 పట్టుకున్నారంట. ఇట్ల దినాము పట్టుబడేటివన్నీ ముగ్గురు సభ్యుల కమిటీకి ఇస్తారు. ఆటికి పొయ్యి ఆధారాలు సూపిస్తే ఎనిక్కి ఇస్తారంట.."

"ఇదంతా పీకులాట కదా శిష్యా..! యాదానికైనా ముందు జాగర్త ఉండల్ల. బ్యాంకు సీటీనో అంగిడి బిల్లో ఎంట తీసకపోతే అయిపాయె.. ఏమంటావు..?"

"ఇంట్లో లెక్క.కి బిల్లులు యాడ తెచ్చేది గురూ..? నువ్వు బో చెప్పిన్యావుగానీ.. నేనైతే అంత దూరంలో పోలీసోల్లని సూడగానే ఇంగో సందులో దూరి తప్పించుకుంటా.."

"అప్పుడుగానీ నిన్ని దొంగనాయాలు అనుకోరు..! ఎంటబడి పట్టుకోని తుక్కు రేగ్గొడతారు. ఉండే లెక్కంతా పీక్కోని కేసు పెడతారు. పోలీసులు కనపడితే.. మరియాదగ విషయం చెప్పల్ల. మాదే సార్ లెక్క.. యాదో అవసరానికి తీసకపోతాండాం అని చెప్తే ఇడిసి పెట్టినా ఇడిసిపెడతారు. అట్ల కాకున్యా ఆ కమిటీ దెగ్గిరికి పొయి మళ్లీ తెచ్చుకోచ్చు.. ఈ పొద్దుకి సాలుగానీ.. అట్ల తిరిగి మళ్లీ రేపు రాపో శిష్యా"

"అట్లనే గురూ.. నాకేమన్నా పనా.. పాటా.. తినడం.. తిరగడం.. ఏమేం జరుగుతాందో సూసొత్తాలే.."

- విడపనకల్లు/ నార్పల

చంద్రబాబు చేపట్టాడని..!

• హంద్రీనీవా విస్తరణ పనుల పట్ల వివక్ష •

- టెండర్లు రద్దు చేసి.. జగన్ కక్ష సాధింపు
- చంద్రబాబు సీఎం అయితేనే కల సాకారం
- కరువు జిల్లా రైతుల మనోభావం





గుంతకల్లు, ఏప్రిల్ 17: సీఎం జగన్ ఎప్పుడూ తనకు తాను రైతు బాంధవుడినని ఘనంగా చెప్పుకుంటుంటారు. కానీ ఆయన ప్రభుత్వం మాత్రం రైతు సమస్యలను గాలికి వదిలేస్తుంటుంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక సాగు నీటి ప్రాజెక్టుల పట్ల వ్యవహరిస్తున్న తీరు దీనికి నిదర్శనం. హంద్రీనీవా పనులను పూర్తి చేస్తామని, సామర్థ్యాన్ని పెంచుతామని ఇచ్చిన హామీని జగన్ విస్మరించారు. హంద్రీనీవా కాలువలో రెట్టింపు నీటిని పారించడానికి 2017లో కాలువ విస్తరణ పనులు చేయాలని నాటి సీఎం చంద్రబాబు సంకల్పించారు. మల్యాల నుంచి జీడిపల్లి రిజర్వాయరు వరకూ రూ.1,030 కోట్లతో తొలిదశ పనులకు పైలాన్‌ను పామిడిలో ఆవిష్కరించారు. పనులు ఆలస్యంగా ప్రారంభంకావడంతో ఎన్నికలలోపు పూర్తిచేయలేకపోయారు. దాదాపు 50 శాతం పనులు పూర్తికాగా, మట్టికట్ట పనులు, సిమెంటు కాంక్రీటు పనులు పెండింగు పడ్డాయి. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ.. ఐదేళ్ల కాలంలో కాలువ పనులను ఇంచు కూడా చేపట్టలేదు. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉండుంటే ఏడాది లోపు పనులు ముగిసేవి. రైతులకు మేలు జరిగేదని జిల్లావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





రివర్స్ టెండరింగ్

2018లో తన 67వ పుట్టిన రోజున అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు.. కేవలం 90 రోజుల వ్యవధిలో హంద్రీనీవా వైడెనింగ్ తొలిదశ పనులను పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. వెంటనే పనులను చేపట్టారు. అంత తక్కువ సమయంలో పనులు పూర్తికావేమోనన్న అనుమానాలు ఉన్నా, పట్టిసీమ పనుల తరహాలో చేపడదామని చంద్రబాబు పిలుపునిచ్చారు. కానీ ప్రాజెక్టు డిజైనింగ్, అంచనాల తయారీ, టెండరు అగ్రిమెంటులో జాప్యం కారణంగా పనులు పూర్తిచేయలేకపోయారు. 2019లో ఎన్నికల అనంతరం అధికారాన్ని చేపట్టిన జగన్.. రివర్స్ టెండరింగ్ పేరిట పాత పనులను రద్దుచేశారు. తర్వాత రెండేళ్లకు దాదాపు రూ.6వేల కోట్లతో అంచనాలను తయారు చేయించి.. టెండర్లను పిలిచారు. అంతటితో సరిపెట్టారు. కాలువను వెడల్పు పనుల ఊసే లేదు. హంద్రీనీవా తొలిదశ కింద 216 కి.మీ. కాలువలో ఒక్క ఇంచి కూడా తవ్వలేదు. వైడెనింగ్‌లో మట్టి తవ్వకం పనులు, వంతెనల వద్ద కాలువను వెడల్పు చేయకుండా లైనింగ్ పనులు, మట్టికట్టలు ఉన్న చోట ఒక ఒడ్డును తొలగించి కాలువ వెడెల్పు పనులు జరగాల్సి ఉంది. మట్టి పనులు దాదాపు 80 శాతం (మొత్తం పనుల్లో 50 శాతం) పూర్తయ్యాయి. మట్టికట్ట పనులు, సిమెంటు కాంక్రీటు పనులు ప్రారంభం కాలేదు. చంద్రబాబు చేపట్టిన పనులను ఉద్దేశపూర్వకంగా వైసీపీ ఐదేళ్లు పెండింగులో ఉంచింది.


చంద్రబాబు హయాంలో జరిగిన హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు

పూర్తి చేసే ఉద్దేశమేలేదు..

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవా తొలి దశ కాలువ వెడెల్పు అంశంపట్ల నిర్లక్ష్యం వహించింది. టీడీపీ పిలిచిన టెండర్లను రద్దు చేసి, కక్ష తీర్చుకోవడమే లక్ష్యంగా పనులను ఆపేశారు. 2019 నుంచి 2022 వరకూ వైడెనింగ్ మాటే ఎత్తలేదు. మూడేళ్ల తర్వాత సమావేశాలు పెట్టి రూ.6 వేల కోట్లతో కొత్త ప్లానింగ్‌తో కాలువను వెడెల్పు చేస్తామని ప్రకటించి.. చేతులు దులుపుకున్నారు. వైసీపీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ.. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధుల బృందం గత సంవత్సరం హంద్రీనీవా కాలువను సందర్శించింది. టీడీపీ హయాంలో జరిగిన వైడెనింగ్ పనుల వద్ద సెల్ఫీ చాలెంజ్ చూడా చేశారు. అయినా ప్రభుత్వంలో ఏమాత్రం స్పందన రాలేదు. వైడెనింగ్ పనులు పట్టాలెక్కాలంటే మళ్లీ చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావాల్సిందేనని రైతులు అంటున్నారు. ప్రస్తుతం 10 అడుగులు బెడ్డింగ్ ఉన్న కాలువను 19.5 అడుగుల బెడ్డింగ్ ఉండేలా వెడెల్పు చేస్తే.. దాదాపు 70 టీఎంసీల నీరు తెచ్చుకునేందుకు వీలు కలుగుతుంది. ఇదే ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. విస్తరణ పనులు పూర్తి అయితే.. తొలిదశ, రెండో దశ కాలువల్లో ఏకకాలంలో నీటిని పూర్తి స్థాయిలో పారించడానికి వీలు కలుగుతుంది.

ఈరలక్కప్పకు ఎమ్మెల్యే సహకరించేనా...?

తిప్పేస్వామి నిర్ణయంపై సర్వత్రా చర్చ


ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

మడకశిరటౌన్, ఏప్రిల్ 17: మడకశిర సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామిని కాదని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈరలక్కప్పకు ఆ పార్టీ అవకాశం ఇచ్చింది. ఈరలక్కప్పను అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు మడకశిర నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి తన మద్దతు తెలుపలేదు. పార్టీ విజయానికి కృషి చేస్తానని చెప్పకపోవడంతో ఆయన అనుచరులు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. ఎమ్మెల్యే మౌనం వీడతారా లేదా అన్న సంశయంలో కొంత మంది ఆయన అనుచరులు ఎదురు చూస్తున్నారు. కొంతమంది ఈరలక్కప్ప కలుపుకొని పోవాలని కోరుతున్నట్లు సమాచారం. ఏ నిర్ణయం చెప్పక పోవడంతో పార్టీని వీడటానికి ఇంకొంతమంది సిద్ధపడుతున్నారని ప్రచారం సైతం సాగుతోంది. అందుకు బలం చేకూర్చే విధంగా గుడిబండ సింగిల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్‌తోపాటు 18 మంది అందులోనూ ఎంపీటీసీలు, సర్పంచులు, రొళ్ల, అగళి, గుడిబండ మండలాలకు చెందినవారు తమ రాజీనామాను ప్రకటించారు. ఏ పార్టీలోకి చేరుతామన్న విషయం వారు స్పష్టత ఇవ్వలేదు. వారు ఎమ్మెల్యే సూచన మేరకే నడుచుకొంటారా లేక సొంత నిర్ణయాలు తీసుకొంటారా అన్న చర్చ సాగుతోంది. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామికి మడకశిరపై కొంత పట్టు ఉండడంతో ఆయన మౌనంగా ఉంటే ఇటు టీడీపీకి, అటు కాంగ్రెస్‌కు ఎవరికి లాభం చేకూరుతుందోనని చర్చ సాగుతోంది. నామినేషన్ వేసిన అనంతరం అయినా వైసీపీ అభ్యర్థి ఈరలక్కప్పకు మద్దతు తెలిపి ప్రచారం చేస్తారా వేచి చూడాలని వైసీపీ నాయకులు అంటున్నారు. మరోపక్క రొళ్ల మండలం హెచ్‌టీ హళ్లి గ్రామానికి చెందిన ధనరాజ్ వైసీపీ టిక్కెట్ ఆశించారు. దక్కక పోవడంతో తాను ఇండిపెండెంట్‌గా పోటీచేస్తానని, రెబల్‌గా ఉంటానని తనకు మద్దతు తెలపాలని, గతంలో తనతోపాటు వైసీపీ బలోపేతానికి కృషి చేసిన వారితో కలిసి మద్దతుకోరుతున్నారు.

టీచర్ సస్పెన్షన్



ఎన్నికల సిబ్బంది జాబితా లీక్‌పై కలెక్టర్ సీరియస్



అనంతపురం టౌన్, ఏప్రిల్ 17: ఎన్నికల నిర్వహణకు నియమితులైన పీఓ, ఏపీఓ, ఓపీఓల జాబితా లీకు చేసిన వ్యవహారంపై కలెక్టరు వినోద్‌కుమార్ కన్నెర్ర చేశారు. దీనికి బాధ్యులను చేస్తూ యల్లనూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పీడీగా పని చేస్తున్న బి. జయకుమారిని బుధవారం సస్పెండ్ చేశారు. అధికార పార్టీకి మేలు చేయడానికే ఈ జాబితా లీకు వ్యవహారం సాగిందని విచారణలో తేలింది. విద్యాశాఖాధికారుల విచారణ సందర్భంగా కూడా ఆ పీడీ సీఎం తమ బంధువని అందుకే ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపుల్లో పార్వర్డ్ చేశానని గడసరిగా బదులిచ్చినట్లు సమాచారం. విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపగా ఆయన సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఈజాబితాను బయటకు తీసుకురావడంలో కొందరు విద్యాశాఖలో పనిచేసే టీచర్ల పాత్ర ఉన్నట్లు ఇప్పటికే విచారణాధికారులు అంచనాకు వచ్చారు. వారి నుంచి వెళ్లిన ఈజాబితాను అనేక మంది టీచర్లు ఇతరులకు పార్వర్డ్ చేసినట్లు సమాచారం. ఇప్పుడు ఆటీచర్లలో టెన్షన్ మొదలైంది.

● అధికారపార్టీకి మద్దతుగా ప్రచార కార్యక్రమాలలో పాల్గొంటున్న కూడేరు మండలం గొట్కూరుకు చెందిన ఉపాధి హామీ పథకం మేట్ జయప్పను తొలగిస్తూ కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు.

రాజీనామా చేసి పార్టీకి పనిచేయండి

- అలా చేసిన వారికే మళ్లీ అవకాశం
- మా మాట వినకుంటే ఇబ్బందులు తప్పవు
- వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్న కౌన్సిలర్లు



హిందూపురం, ఏప్రిల్ 17 : ఎన్నికల్లో గెలిచేందుకు వైసీపీ ఎత్తుకు పై ఎత్తులు వేస్తోంది. వలంటీర్లను వాడుకుని ఎలాగైనా గెలవాలని చూస్తోంది. వారి వద్ద ఉన్న సమాచారం, ఓటర్లతో ఉన్న సంబంధాలను ఎన్నికల్లో తమకు అనుకూలంగా మలుచుకుని మళ్లీ గద్దెనెక్కాలనే లక్ష్యంతో అధికార పార్టీ నాయకులు వ్యూహరచనలు చేస్తున్నారు. రాజకీయ పార్టీల నాయకులకు వలంటీర్లు దూరంగా ఉండాలని ఎన్నికల సంఘం ఆదేశించడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డ వైసీపీ నాయకులు మరో బరితెగింపునకు సిద్ధమయ్యారు. వలంటీర్లను మొత్తంగా రాజీనామా చేయించి వారి పరిధిలో ఓట్లు వేయించుకునే విధంగా ప్రయత్నిస్తున్నారు. వారితో నిర్బంధంగా రాజీనామా చేయిస్తున్నారు. హిందూపురం పట్టణంలో కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు ఈ పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి చేరవేసి ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేసిన వలంటీర్లు అధికార పార్టీకి దాసోహమై జగన్‌కు ప్రైవేట్ సైన్యంలా మారారు. వారిని పక్కన పెట్టాలని ఎన్నికల సంఘం ఆదేశించడంతో వైసీపీ నాయకులు కొత్త నాటకానికి తెరలేపారు. హిందూపురం పట్టణంలో 38వార్డులుండగా సుమారు 700 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వీరందరినీ నామినేషన్‌లోపు రాజీనామాలు చేయించి ప్రత్యక్షంగా వైసీపీకి పనిచేయించుకునేందుకు సిద్ధమవుతున్నారు. కొందరు కౌన్సిలర్లే రాజీనామా పత్రాలు తీసుకెళ్లి వారిచేత సంతకాలు చేయించుకుంటున్నారు.

రాజీనామా చేయకపోతే ఇబ్బందులు తప్పవు

'వలంటీర్లు రెండు మూడురోజుల్లో అందరూ రాజీనామా చేయాలి. వచ్చేది మా ప్రభుత్వమే. అప్పుడు మిమ్మల్ని తొలగించి వేరే వ్యక్తులను తీసుకుంటాం. ఇప్పుడు మా మాట వినకుంటే ఇబ్బందులు తప్పవు' అని వైసీపీ నాయకులు వలంటీర్లను బెదిరిస్తున్నారు. కౌన్సిలర్లు వలంటీర్లను తమ ఇళ్లకు పిలిపించుకుని రాజీనామా పత్రాలపై సంతకాలు చేయాలని ఆదేశిస్తున్నారు. పార్టీ పెద్దలు కూడా రాజీనామాలపై కౌన్సిలర్లు గురిపెట్టాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. హిందూపురం పట్టణంలోని ఓ వార్డులో మంగళవారం వలంటీర్లను ఇళ్లకు పిలిపించుకుని సంతకాలు చేయించుకున్నారు. కొంతమంది రాజీనామాకు ఒప్పుకోకపోవడంతో బెదిరించి సంతకాలు చేయించుకున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు హిందూపురం పట్టణంలో వంద మందికిపైగా రాజీనామా చేయగా బుధవారం సెలవు కావడంతో గురువారం మరింత మంది రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నారు.


రాజీనామా చేసేందుకు వెళ్లి కౌన్సిలర్ ఇంట్లో కూర్చున్న వలంటీర్లు

టీడీపీ ప్రతినిధులపై వైసీపీ నాయకుల దాడి

ఉరవకొండ, ఏప్రిల్ 17: పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో ఓటరు వెరిఫికేషన్ చేస్తున్న సంతోష్ అనే వ్యక్తిపై వైసీపీ నాయకులు దాడి చేశారు. నియోజకవర్గంలో దొంగ ఓట్లు ఉన్నాయన్న అనుమానంతో టీడీపీ నాయకులు బుధవారం ఓటరు వెరిఫికేషన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే స్థానిక 120 పోలింగ్ బూత్ పరిధిలో టీడీపీ అభ్యర్థి తరపున బూత్ కన్వీనర్ నాగభూషణంతో పాటు సంతోష్ ఓటరు లిస్ట్ వెరిఫికేషన్ చేస్తున్న సమయంలో వైసీపీ నాయకులు భీమా, హనుమంతు, శర్మాష్, నూర్, రాజశేఖర్, హనుమంతు అడ్డుకుని నానాదుర్భాషలాడుతూ చేతిలో ఉన్న ఓటరు లిస్టును లాక్కోవడానికి ప్రయత్నించారు. అడ్డుకోబోయిన సంతోష్‌పై వైసీపీకి చెందిన భీమా, రామిరెడ్డి, హనుమంతు, శర్మాష్, సంతోష్‌పై దాడి చేశారు. కిందపడిపోయిన సంతోష్‌ను కాళ్లతో ఇష్టానుసారంగా తన్నారు. గాయాలయిన సంతోష్‌ను బూత్ కన్వీనర్ ఆసుపత్రికి తరలించారు. రేపటి నుంచి టీడీపీ తరపున ఎవరైనా వస్తే బాగుండదని హెచ్చరించినట్లు బాధితుడు తెలిపారు. తమపై దాడి చేసిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


ఆస్పత్రిలో టీడీపీ నాయకులను విచారిస్తున్న పోలీసులు

ఎస్సీ, ఎస్టీ, బీసీల ద్రోహి జగన్‌రెడ్డి

కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి పరిటాల సునీత

రామగిరి, ఏప్రిల్ 17: నిత్యం 'నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీలు' అంటూనే సీఎం జగన్‌రెడ్డి వారికి తీరని అన్యాయం చేస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ, బీసీల ద్రోహిగా చరిత్రలో నిలిచిపోయారని మాజీ మంత్రి, కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని వెంకటాపు రంలో ఆమె మీడియాతో మాట్లాడారు. దళితు లను తీవ్రంగా అవమానించిన తోట త్రిము ర్తులను సీఎం జగన్‌రెడ్డి కాపాడటంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 1996లో జరిగిన శిరోముండనం కేసులో విశాఖపట్నం కోర్టు ఆయ నకు శిక్ష విధించిందన్నారు. దళితుల ద్రోహులకు ఆశ్రయం కల్పిస్తున్న వ్యక్తి జగన్ అన్నారు. అయినా ప్రతి వేదికపైన సీఎం జగన్ రెడ్డి 'నా ఎస్సీ, ఎస్టీలంటూ కపటప్రేమ ఒలక బోస్తున్నారన్నా'రు. దళితులను చంపిన అనంత బాబును పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టే చేసి మళ్లీ పార్టీలోకి తీసుకున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జగన్ ప్రభుత్వంలో దళి తులపై దాడులు పెరిగాయని, ఇప్పటివరకు 6035 మంది దళితులపై దాడులు జరిగాయని అన్నారు. ఎన్‌సీఆర్బీ నివేదిక ప్రకారం దళితు లపై దాడులు జరుగుతున్న రాష్ట్రాల్లో ఏపీ 7వ స్థానంలో ఉందన్నారు. ఎంతో మంది దళితులు హత్యకు గురయ్యార న్నారు. డాక్టర్ సుధాకర్ నుంచి దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం వరకు బలి తీసు కున్న ప్రభుత్వంపై దళితులు ఎంతో ఆగ్రహంగా ఉన్నారని, ఈ ఎన్నికల్లో వారి సత్తా చూపిస్తారని అన్నారు. దాడులే కాకుండా అనేక పథకాలు ఎత్తే సిన ద్రోహి జగన్ అన్నారు. చాలా మంది దళితులు ఈ విషయాలు తెలుసు కోవాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ గతంలో ఏం చేసింది... ఇప్పుడే వైసీపీ ఏం చేసిందో ఒకసారి ప్రజలే ఆలోచిం చుకోవాల న్నారు. సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, మాజీ ఎంపీపీ పరందామయాదవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పరిటాల సునీత

అర్హులకు అందని పథకాలు

వైసీపీ హయాంలో పార్కులు, ఆట స్థలాలూ కబ్జా: అనంత అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్


ప్రచారంలో పాల్గొన్న దగ్గుబాటి ప్రసాద్, అంబికా లక్ష్మీనారాయణ


వైసీపీ నాయకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న దగ్గుబాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 17: అర్హత ఉన్నా అనేక మందికి ప్రభుత్వ పథకాలు ఎందుకు వర్తింపజేయడం లేదని అనంత అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ ఎమ్మెల్యే అనంతను నిలదీశారు. బుధవారం 22వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ రాధాదేవి ఆధ్వర్యంలో స్థానిక బుడ్డప్ప నగర్‌లో ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. స్థానిక ప్రజలు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఘనంగా స్వాగతం పలికారు. అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ... బాణా సంచా పేలుస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. స్థానిక ప్రజలు పార్కు, ఆట స్థలాలు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తాను నగరాన్ని అంతా చాలాసార్లు చుట్టేశానని కబుర్లు చెబుతున్నారని, కానీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ఎద్దేవా చేశారు. నగరంలో అనేక ప్రాంతాల్లో పార్కులు, ఆట స్థలాలు కబ్జాకు గురవుతున్నాయన్నారు. అధికారంలోకి రాగానే కబ్జాలపై విచారణ చేయించి తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంత అర్బన్ అభివృద్ధి విషయంలో తాము స్పష్టమైన వైఖరితో ఉన్నామన్నారు. అలాగే మాజీ కో-ఆప్షన్ సభ్యులు, టీడీపీ నాయకురాలు షరీనా, ఆమె కుమారుడు ఇమ్రాన్‌ను వారి నివాసంలో దగ్గుబాటి ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ ఎన్నికల్లో తన విజయం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మేయర్ స్వరూప, నాయకులు జేఎల్ మురళీధర్, బుగ్గయ్య చౌదరి, మారుతీకుమార్ గౌడ్, ముక్తియార్, సుధాకర్ నాయుడు, ఉమర్, బాబా ఫక్రుద్దీన్, రమేష్, రాయల్ మురళీ, సరిపూటి రమణ, నటేష్ చౌదరి, రాజారావు, గోపాల్ గౌడ్, పోతుల లక్ష్మీనరసింహులు, సైఫుద్దీన్, నెట్టెం బాలకృష్ణ, కృష్ణకుమార్, పెండ్యాల శ్రీలత, సంగా తేజస్విని పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక: 22వ డివిజన్‌లోని పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు దగ్గుబాటి ప్రసాద్, అంబికా లక్ష్మీనారాయణల సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ జెండాను కప్పి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. వైసీపీ పాలనపై ప్రజలతో పాటు సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలే విసిగిపోయారని దగ్గుబాటి ప్రసాద్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరింత మంది టీడీపీలో చేరే అవకాశం ఉందని ఆయన చెప్పుకొచ్చారు.


మాజీ కో ఆప్షన్ సభ్యురాలు షరీనా, ఆమె కుమారుడు ఇమ్రాన్‌ను కలిసిన దగ్గుబాటి ప్రసాద్

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసా నాయుడు

నార్పల,ఏప్రిల్ 17: టీడీపీ అధినేత చంద్ర బాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు పేర్కొన్నారు. నార్పల మండలం కూరగానిపల్లిలో బుధవారం ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను గెలపించాలని ప్రచారం నిర్వ హించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు ఆలం వెంకటనరసానాయుడు, నాయకులు ఆకుల ఆంజనేయులు, పిట్టు రంగా రెడ్డి, ఆలం నాగార్జున నాయుడు, ఎర్రినాగప్ప, చంద్రబాబు, లక్ష్మీనాయుడు, జాఫర్, రాజన్న, పీఎల్ లక్ష్మీనారాయణ, తలారి కుల్లాయప్ప, గోపా లొరెడ్డి, నాగిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, లోకనాథ్ రెడ్డి, చంద్రమోహన్, రాంగోపాల్‌రెడ్డి, జయచం ద్రరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్ర, శ్రీరాములు, చంద్ర, భాస్కర్, కల్లాయ ప్ప, పెద్దన్న, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో స్థానిక నాయకులతో కలసి మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి, శింగన మల నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ సోదరి బండారు కిన్నెర శ్రీ బుధవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్ర మంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల క్రిష్ణయ్య, నాయకులు వడ్డెర సంఘం సమితి జిల్లా అధ్యక్షుడు వడ్డే వన్నూర్, టీఎన్‌టీయూసీ జిల్లా అధికార ప్రతినిధి బాబ య్య, గోరకాటి వెంకటేసు, బొగ్గుల వెంకటేసు, రామకృష్ణ, జయరాం, వడ్లరాము, ఆవుల శీనా, అంజి, సామాల మధు, చింతా వెంకట్రాముడు, చల్లానాగరాజు, రామాంజి, రాము పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక: గార్లదిన్నె మండలంలోని కొప్పలకొండలో శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచు ఫుల్లన్న, ఎల్‌ఐసీ ఆదినారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ అంజినేయులు, రాముడు, పెద్దఇటుక నల్లప్ప, చిన్నఓబిలేసు, బెస్త వెంకట్రాముడు, నాగేంద్రయ్య, సుబ్బ రాయుడు, ఓబిలేసు, నాగార్జున పాల్గొన్నారు.

ఆర్థిక సాయం: కేశవాపురం గ్రామానికి చెందిన దాసరి రామాంజినేయులు కుమార్తె వివాహానికి ముంటిమడుగు కేశవరెడ్డి రూ. 10వేలు ఆర్థిక సాయం అందచేశారు.


కూరగానిపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ఆలం నరసానాయుడు

సర్వేపల్లి రాధాకృష్ణకు ఘన నివాళి

అనంతపురం క్లాక్‌టవర్: మాజీ రాష్ట్రపతి, భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణ వర్ధంతి సందర్భంగా స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి బుధవారం పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర సాహితీ అకాడమి అవార్డు గ్రహీత రమేష్ నారాయణ, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు సుంకర రమేష్ మాట్లాడు తూ... ఆర్ట్స్ కళాశాలలో అధ్యాపకుడిగా సర్వేపల్లి రాధాకృష్ణ సేవలు అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి మంజుల, నందిత, సభ్యులు ముత్యాలమ్మ, ధోని, దివ్యతేజ, సతీష్ పాల్గొన్నారు.

వైసీపీ రంగుల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నార్పల, ఏప్రిల్ 17: స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు ఎన్నికల కోడ్ ఉల్లంఘించి వైసీపీ రంగులు ఉన్న పంచాయతీ కార్యాల యంలోనే గ్రామ సభలను నిర్వహిం చాడు. బుధవారం దీనిపై ఆంధ్రజ్యోతిలో తొలగని పంచా యతీ రంగులు అనే కథనం వెలవడింది. ఇందుకు స్పందించిన పంచాయతీ అధికారులు ఆ వైసీపీ రంగులను తొలగించారు.


కార్యాలయంలో తొలగించిన వైసీపీ రంగులు

అనంత కళాకారులకు అవార్డులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 17: తెలుగు నాటకరంగ కళాకారుల దినోత్స వాన్ని పురస్కరించుకుని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు లలితకళా పరిషత్ ఆధ్వ ర్యంలో కందుకూరి వీరేశలింగం అవార్డులకు ఎంపికైన కళాకారులకు అవార్డులు అందజేశారు. బుధవారం సాయంత్రం పరిషత్ ఆవరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పరిషత్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, గాజుల పద్మజ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రంగస్థల కళాకారులు కేశప్ప నాయుడు, రామాంజినేయులు, ఆనంద్, దయానంద్, ఉంగరాల శ్రీనివాసులు, రాధారాణి, సత్యనారాయణబాబు, కృష్ణంరెడ్డిపల్లి నారాయణస్వామికి కందుకూరి వీరేశలింగం అవార్డులను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సంగాల నారాయణస్వామి, పతికి రమేష్ నారాయణ, అస్లాం బాషా, లోకేష్ పాల్గొన్నారు.


అవార్డులతో రంగస్థల కళాకారులు

ఆవులకు కృత్రిమ కాళ్ల అమరిక

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 17: మహావీర్ లింబ్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం అనంత పురం నగరంలోని ఇస్కాన్ గోశాలలోని నాలుగు ఆవులకు కృత్రిమ కాళ్లను అమర్చారు. హుబ్లీలోని మహావీర్ లింబ్ సెంటర్ నిర్వాహకులను వెట ర్నరీ డాక్టర్ పద్మనాభం ఇటీవల సంప్రదించి ఇస్కాన్ గోశాలలోని రోడ్డు ప్రమాదంలో కాళ్లు కోల్పోయిన ఆవుల పరిస్థితిని వివరించారు. దీంతో ఆవులకు కృత్రిమ కాళ్లు అమర్చేందుకు అంగీకరించారు. నెలరోజుల క్రితం నాలుగు ఆవుల కాళ్ల కొలతలు తీసుకువెళ్లారు. బుధవారం మహావీర్ లింబ్ సెంటర్ చైర్మన్ మహేంద్ర సింఘీ, కోశాధికారి కాంతిలాల్ బోహరా, టెన్నీషి యన్లు నాయకర్ అనంతపురం ఇస్కాన్ గోశాల లోని నాలుగు ఆవులకు కృత్రిమ కాళ్లు అమ ర్చారు. కార్యక్రమంలో ఇస్కాన్ అధ్యక్షుడు దామో దర్ దాస్, సుదర్శన్ ప్రభు తదితరులు పాల్గొ న్నారు.

ఇసుక రావాణాను అడ్డుకున్న గ్రామస్థులు

గార్లదిన్నె, ఏప్రిల్ 17: మండలంలోని ఇల్లూరు గ్రామ సమీపంలో ఓ కంపెనీ ఇసుక రావాణాను బుధవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. తమ పొలాల సమీపంలో ఇసుకు తరలిస్తే బోరుబావుల్లో నీరు తగ్గిపోతాయని మండిపడ్డారు. ఇసుక తరలిస్తే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. దీంతో ఇసుక తరలింపు పనులు ఆగిపోయాయి.

వైభవంగా చందనోత్సవం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 17: సాయినాథుడు షిర్డీలో ఏటా శ్రీరామనవమి పర్వదినాన నిర్వహించిన చందనోత్సవ వేడుకను నిర్వహించేశారు. ఆ ఆచారం నేటికీ కొనసాగుతోంది. బుధవారం సాయంత్రం నగరంలోని పలు సాయి మందిరాల్లో ఆ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో రామచంద్రనగర్‌లోని షిర్డీ సాయి ఆలయంలో సాయినాథుని మూలవిరాట్‌కు చందనం తో అభిషేకించి, ప్రత్యేక అలంకరణ చేసి... పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు మారుతి ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 17: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని మండలంలోని శిల్పారామంలో బుధవారం నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు చూపర్లను ఆకట్టుకున్నాయి. నగరానికి చెందిన శ్రీ గురుకృపా సంగీత నిత్య కళానికేతన్ నృత్య గురువు డా. పట్నం శివప్రసాద్ శిష్యబృందం కూచిపూడి, భరత నాట్య నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో శిల్పారామం ఏఓ క్రిష్ణప్రసాద్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి 'అమ్మ' అండ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 17 : నిరుపేద కుటుంబానికి అమ్మ ట్రస్టు అండగా నిలిచింది. నగరంలోని గుత్తిరోడ్డులో నివాసముండే వీరన్న బార్బర్‌గా పనిచేసేవాడు. రెండు సంవత్సరాల క్రితం పక్షవాతం బారిన పడటంతో మంచానికే పరిమితమయ్యాడు. వీరన్న భార్య నాగరత్నమ్మ రైతుకూలీగా వెళ్తూ కుటుంబాన్ని పోషించేది. జనవరిలో నాగరత్నమ్మకు ప్రమాదవశాత్తు ఆమె ఎడమచేయి గడ్డికోసే యంత్రంలో ఇరుక్కుని తెగిపోయింది. దీంతో వీరి కుమార్తె శ్రావణి ఓవైపు బీఈడీ చదువుకుంటూ.. మరోవైపు ఇళ్లల్లో పాచిపనులు చేసుకుంటూ తల్లిదండ్రులను పోషించుకునేది. వీరు సాయం కోసం అమ్మ సంస్థను ఆశ్రయించారు. ఆ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి బుధవారం ఆ కుటుంబాన్ని కలిశాడు. నాగరత్నమ్మకు రూ.40 వేల విలువచేసే కృత్రిమ చేయిని, శ్రావణి చదువు, వీరన్న వైద్య ఖర్చుల కోసం రూ.40 వేలు, నిత్యావసర సరుకుల కోసం మరో రూ.20 వేలు అందజేశారు. భవిష్యత్‌లో మరింత సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు.



నేటి నుంచి ఉచిత స్కేటింగ్ శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 17: వేసవి ఉచిత స్కేటింగ్ శిక్షణ గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు శ్రీవాసవి స్కేటింగ్ అకాడమీ కోచ్ కేదర్‌నాథ్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు కళ్యాణదుర్గం రోడ్డులోని కోల్డ్ స్టోరేజ్ ఎదురుగా స్కేటింగ్ గ్రౌండ్‌కు హాజరుకావాలన్నారు. వివరాలకు 9000387042, 8897833593 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చీనీకాయలు టన్ను రూ.37 వేలు

అనంతపురం రూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.37 వేలు, కనిష్టంగా రూ.19 వేలు, సరాసరి రూ.26 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 991 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నేడు షర్మిల రాక

నార్పల, ఏప్రిల్ 17: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల గురువారం నార్పలకు వస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి బుధవారం తెలిపారు. స్థానిక గాంధీ సర్కిల్‌లో రోడ్డుషో నిర్వహిస్తార న్నారు. ఇందుకు సంబంధించి నార్ప లలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి స్థల పరిశీలన చేసిన ఆయన మాట్లాడారు. షర్మిలతో పాటు మాజీ మంత్రులు రఘువీ రరెడ్డి, శైలజనాథ్ హాజరవుతా రన్నారు.

చైన్ స్నాచింగ్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 17: స్థానిక భైరవన్‌గర్ 11వ క్రాస్‌లో నివాసముం టున్న కమల మంగళవారం రాత్రి తన ఇంటి సమీయంలో వాకింగ్ చేస్తుండగా దుండగులు ఇద్దరు బైక్‌లో వేగంగా వచ్చారు. ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసు లాక్కొని వెళ్లిపోయారు. బాధి తురాలు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించింది. సీఐ రెడ్డప్ప సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ పుటేజీ ఆధారంగా దొంగలను గుర్తించే పనిలో పడ్డారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

శింగనమల: శింగనమల అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థుల నుంచి నామినేషన్లను గురువారం నుంచి ఈనెల 25 వరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్వీకరిస్తు న్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీను వెన్నెల తెలిపారు. ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలు వరకు మాత్రమే నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాట్లను ఎస్పీ అమిత్‌బర్దర్ పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఎవరైనా గొడవలు, ఘర్షణలకు పాల్పడితే వారిపై కఠన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీను వెన్నెల, డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్ఐ చంద్రశేఖర్ ఎన్నికల సిబ్బంది ఉన్నారు.



ఆజాద్‌నగర్ దత్తమందిరం వద్ద కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, తిలకిస్తున్న భక్తులు

అంతా రామమయం

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : శ్రీరామనవమి వేడుకలను బుధవారం జిల్లావ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. సీతారా ములకు కల్యాణోత్సవం జరిపించడంతో పాటు పలుప్రాంతాల్లో ఉట్టికొట్టడం, ఉట్లమానుపరుష, పానకం, వడపప్పు వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. జానకిరాముడి కల్యాణా న్ని కనురాలా వీక్షించి అనంత భక్తజనం పులకించిపోయింది. ఆజాద్‌నగర్‌లోని దత్తమందిరం వద్ద ధర్మకర్త డాక్టర్ నలుబోలు మధురాయల్ దంపతుల నేతృత్వంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం టీడీపీ అనంతపురం అర్బన్ ఎమ్మె ల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ హాజరై భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం శ్రీరామనవమి వేడుకలతో ప్రజలు ఉత్సాహంగా సాగారు. అనంతపురంరూరల్, నార్పల, చెన్నేకొత్తపల్లి, శింగనమల, గార్లదిన్నె, రాప్తాడు, రామగిరి మండలాల్లో శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



ఆజాద్‌నగర్‌లో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం, అన్నదానాన్ని ప్రారంభిస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్


రెవెన్యూ కాలనీ రామాలయంలో తలంబ్రాలు పోస్తున్న పండితులు


సోమనాథ్‌నగర్ రామాలయంలో కల్యాణోత్సవం


నగర సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు


రెవెన్యూ కాలనీ రామాలయంలో..


రామ్‌నగర్ రామాలయంలో..


మౌనగిరి క్షేత్రంలో సీతారాముల కల్యాణం


లక్ష్మీనగర్ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం

అందరికీ బాసటగా నిలుస్తా..

- అనంత అభివృద్ధే ప్రధాన కర్తవ్యం
- నగరవాసుల ఆకాంక్షలు నెరవేర్చడమే ధ్యేయం
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు
- డంపింగ్ యార్డును తరలిస్తా
- నడిమివంక సైడ్‌వాల్‌ను పూర్తిచేస్తా
- పరిశ్రమల ఏర్పాటుకు కృషి
- నిరుద్యోగుల ఉపాధికి బాటలు వేస్తా
- అన్నివర్గాల కష్టాల్లో తోడునీడగా ఉంటా
- అర్బన్ ప్రజలకు కూటమి అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ భరోసా



'జిల్లాకు తలమానికం అనంతపురం అర్బన్ నియోజకవర్గం. ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు.. నగరవాసుల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ముందుంటాను. ఎవరికి ఏ సమస్య వచ్చినా... అది నా సమస్యగా తీసుకొని పరిష్కారం చూపుతా' అని అనంతపురం అర్బన్ నియోజకవర్గ కూటమి అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ నియోజకవర్గ ప్రజలకు భరోసానిస్తున్నారు. రాజకీయాలకు ఆయన కొత్త కానప్పటికీ... పారిశ్రామికవేత్తగా అనుభవం ఉన్న నాయకుడు కావడంతో అనంత నగరాభివృద్ధి పరుగులు పెడుతుందనే ఉత్సాహం, ఆనందం నియోజకవర్గ ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. అందరికి బాసటగా నిలుస్తారనే నమ్మకం నియోజకవర్గ ప్రజల్లో కనిపిస్తోంది. అన్ని వర్గాల ప్రజల్లోనూ ఇదే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లా కేంద్రం కావడంతో ఇక్కడ అన్ని వర్గాల ప్రజలు నివసిస్తున్న నేపథ్యంలో... ఆ వర్గాల ప్రజల్లో మనోధైర్యం, ఆత్మస్థైర్యం నింపాలనే లక్ష్యంగానే ఆయన ప్రచారసరళి కొనసాగుతోంది. మరీ ముఖ్యంగా విద్యాకేంద్రమైన అనంత నగరంలో పరిశ్రమలకు ఊతమిస్తూ.. నిరుద్యోగ యువతకు ఉపాధి బాటలు వేయాలనే సంకల్పంతో ఆయన ముందుకు సాగుతున్నారు. ఆ దిశగా ప్రచారంలో హామీలు ఇస్తున్నారు. ఓ వైపు నగర ప్రజలకు భరోసానిస్తూనే... మరోవైపు సొంత పార్టీ నాయకులు, కూటమి భాగస్వామ్య పార్టీలు జనసేన, బీజేపీ శ్రేణులతో సఖ్యతగా మెలుగుతూ... వారికి అప్యాయతను పంచుతూ సమష్టిగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు ప్రచారంలో అడుగడుగునా ఆదరణ లభిస్తోంది. ఇంకోవైపు సొంత పార్టీ నేతలను ఒకేతాటిపైకి తీసుకురావడంలో సఫలీకృతులు కావడంతో సమష్టిగా ప్రచారంలో దూకుడు పెంచేందుకు మార్గం సుగుమం చేసుకున్నారు.

అనంతపురం, ఆంధ్రజ్యోతి



రోడ్ షోలో నందమూరి బాలకృష్ణ, దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు గజమాల సత్కారం





దగ్గుబాటి కి మహిళల హారతి



ప్రభాకర్ చౌదరితో కరచాలనం చేస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్



ఇస్త్రీ చేస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్

నగరాన్ని అభివృద్ధి చేయడమే ప్రధాన అజెండా

అనంతపురం నగరాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలో అందుకనుగుణంగా ముందుగానే ఓ అజెండా రూపొందించుకున్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు రూపొందించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రచారంలో ప్రజలకు వివరిస్తూ వాటన్నింటిని అమలు చేస్తామని చెప్పుకొస్తున్నారు. అభివృద్ధి అంటే ఇలా ఉంటుందా అని ప్రజలు ఆశ్చర్యపోయేలా పనులు పూర్తీ చేస్తామని హామీ ఇస్తున్నారు. ప్రధానంగా నగరంలో ప్రధాన జఠిల సమస్యగా ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాన్ని చేపట్టడమే తన కర్తవ్యమంటున్నారు. నడిమివంక సైడ్ వాల్ పూర్తిచేసే బాధ్యతను తీసుకుంటానంటున్నారు. మరోవైపు నగర ప్రజలకు సంకటంగా మారిన డంపింగ్ యార్డును నగరానికి దూరంగా తరలించి ఆ సమస్య నుంచి విముక్తి కల్పించేందుకు చొరవ చూపుతానని దగ్గుబాటి అంటున్నారు. ఆ మేరకు ప్రజలకు ప్రచారంలో హామీలిస్తున్నారు. దగ్గుబాటి కుటుంబ సభ్యులు సైతం ఇంటింటికి తిరుగుతూ టీడీపీ విజయానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. వీరి ప్రచారానికి నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

అందరికీ అందుబాటులో ఉంటా...

నియోజకవర్గంలోకి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ అడుగు పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకూ ఏ డివిజన్‌కి వెళ్లినా నాయకులు, కార్యకర్తలకు ఒకటే అభయమిస్తున్నారు. ఏ సమస్య వచ్చినా నేరుగా తనకే తెలపాలని చెబుతున్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా అందరికి అందుబాటులో ఉంటానంటున్నారు. నగరవాసులైనా... కూటమి నాయకులు, కార్యకర్తలైనా ఏ సమయంలోనైనా తన దగ్గరకు సమస్యలు చెప్పుకోవడానికి రావొచ్చని అభయమిస్తున్నారు. ఇందులో ఎవరికి ఎలాంటి సందేహాలకు తావు లేదంటున్నారు దగ్గుబాటివెంకటేశ్వర ప్రసాద్. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ... కూటమి అభ్యర్థులతో సఖ్యతగా మెలుగుతూ... అందరూ ఏకతాటిపైకి వచ్చి అనంత అర్బన్‌లో టీడీపీ జెండా ఎగురవేసేందుకు సిద్ధమవుతున్నారు.



దోసెలు వేస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్

అభివృద్ధే ఉపాధి మంత్రం

నియోజకవర్గం అభివృద్ధి, యువతకు ఉపాధే తన లక్ష్యమని దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. సౌమ్యుడిగా... వివాదారహితుడిగా పేరున్న దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను నగరవాసులు ఆశీర్వదిస్తున్నారు. నగరంలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఆదరణ లభిస్తోంది. డ్రైనేజీ వ్యవస్థను మెరుగపరుస్తామని, తాగునీరు సక్రమంగా అందిస్తామని, నగరాన్ని సుందరీకరిస్తామని, సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తామని ఇలా హామీలు ఇస్తూ ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. నగరపాలక సంస్థను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ రోడ్లను మరమ్మత్తులు చేయించడమే కాకుండా కొత్త రోడ్లు వేయించి ప్రయాణాన్ని సుఖప్రదం చేస్తామని చెబుతున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యకు ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ముస్లింమైనార్టీలతో సహపంక్తి భోజనాలు

రంజాన్ మాసంలో నగరంలోని పలు డివిజన్లలో ముస్లింమైనార్టీ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ సహపంక్తి భోజనాలు చేశారు. వారితో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అందరిని ఆప్యాయంగా పలుకరిస్తూ తాను కూడా మీలో ఒకడినని వారితో కలిసిపోయారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి కృషి చేస్తానని మాట ఇచ్చారు. దగ్గుబాటి చొరవ, కలుపుగోలుతనం, సమస్యల పట్ల అవగాహన, పరిష్కారానికి కృషి గమనించిన ప్రజలు ఇలాంటి వ్యక్తి మనకు ఉండాలని బలంగా కోరుకుంటున్నారు. అదే విధంగా అధికార వైసీపీ నుంచి వలసలు పెరిగాయి. ఇప్పటికే పలువురు అధికార పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో పాటు తటస్థుల కుటుంబాలు సైతం టీడీపీలోకి చేరాయి. ఈ క్రమంలోనే కూటమిలో భాగంగా... టీడీపీ తరపున పోటీ చేస్తున్న దగ్గుబాటి గెలుపు ఖాయమని నియోజకవర్గంలోని ప్రజలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



దగ్గుబాటిని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు, టీడీపీ కార్యకర్తలు



ప్రచారంలో కొబ్బరికాయ కొడుతున్న దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్



బాలయ్యతో..



ప్రచారంలో ఆటో నడుపుతూ...



జనసేన నేతల సమావేశంలో మాట్లాడుతున్న దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్



అశేష జనవాహినితో దగ్గుబాటి పాదయాత్ర



కటింగ్ చేస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్

అమ్మఒడి పేరుతో మోసం చేసిన జగన్‌రెడ్డి

● మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు


కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 17: అమ్మఒడి రూ.15 వేలు పేరుతో ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో రూ.13 వేలు వేసి మోసం చేసిన ఘనత జగన్‌రెడ్డికి దక్కుతుందని టీడీపీ కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని ఆర్‌బీవంక గ్రామంలో మండల కన్వీనర్ హనుమంతు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆర్‌బీవంక, ఆర్‌బీవంక గొల్లలదొడ్డిలో కాలవకు శాలువా, పూలమాలలతో స్వాగతం పలికారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు జయరాంనాయక్, అరవింద్‌నాయక్, గిరిజప్ప, తమన్న, తిప్పేస్వామినాయక్‌తో పాటు పది కుటుంబాలు కాలవ శ్రీనివాసులు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సైకిల్ గాలి వీస్తోందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని, నియోజకవర్గంలో సైకిల్ గుర్తుపై ఓటు వేసి మెజార్టీతో గెలిపించాలని కోరారు. హేమ్లానాయక్, కాటా వెంకటేశులు, రాముడు, వెంకటేశులు, మాజీ జడ్పీటీసీ విజయకుమార్, సిద్ధప్ప, వీరేష్, గిరిధర్‌నాయుడు, సోమశేఖర్, హనుమంతు, లచ్చన్నచౌదరి పాల్గొన్నారు.

వైసీపీ దౌర్జన్యాలు, అక్రమాలే టీడీపీ విజయానికి సోపానాలు

బొమ్మనహాళ్: రాష్ట్రంలో ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో దౌర్జన్యాలు, అక్రమాలే రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి సోపానాలని కాలవ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని ఎల్‌బీనగర్ గ్రామంలో టీడీపీ నాయకుడు ముల్లంగి నారాయణస్వామి స్వగృహంలో విలేకరుల సమావేశంలో కాలవ మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ విజయం ఖాయమన్నారు. ఐదు సంవత్సరాల జగన్‌మోహన్‌రెడ్డి విధ్వంసకర పాలనతో విసిగిపోయిన అన్ని వర్గాల ప్రజలు చంద్రబాబు చల్లని పాలన కోసం చాలా ఆతృతంగా ఎదురు చూస్తున్నారని అన్నారు. ఉపాధి అవకాశాలు లేక ఉద్యోగాలు రాక యువత నిరాశ నిస్పృహల మధ్య కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో బొమ్మనహాళ్, డీ.హీరేహాళ్ మండల కన్వీనర్లు బలరాంరెడ్డి, హనుమంతరెడ్డి, క్లస్టర్ కన్వీనర్ ధనుంజయ, కొత్తపల్లి మల్లికార్జున, మల్లికార్జున, ముల్లంగి భాస్కర్, ఉప్పరహాళ్ స్వామి, పయ్యావుల మోహన్, పయ్యావుల అనిల్, తిమ్మరాజు, సైకిల్‌షాప్ హనుమంతు, చలపతి, సల్లాపురం బాబు పాల్గొన్నారు.

పంచాయతీలను నిర్వీర్యం చేసిన జగన్

● ఎమ్మెల్యే అభ్యర్థి జయరాం


ముస్లింలకు పసుపు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జయరాం

గుంతకల్లు, ఏప్రిల్17: వైసీపీ పరిపాలనలో జగన్మోహన్ రెడ్డి పంచాయతీలను నిర్వీర్యం చేశాడని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం మండిపడ్డారు. బుధవారం సాయంత్రం మండలంలోని ఎన్ వెంకటాంపల్లిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామీణులను కలసి టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా బరిలో నిలిచిన తనకు, అంబికా లక్ష్మినారాయణకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ పల్లెల్లో కనీసం కాలువలు శుభ్రం చేయడానికి కూడా వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వలేదన్నారు. అధికారంలోకి వచ్చి టీడీపీ చేపట్టిన నాగసముద్రం, చింతలాంపల్లి రోడ్ల పనులను ఆపించి, ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయన్న కారణంగా మరలా చేపట్టారని ఎద్దేవాచేశారు. ముష్టూరు తిమ్మప్ప, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు, రామన్న చౌదరి పాల్గొన్నారు.

టీడీపీలోకి ముస్లిం మైనార్టీలు: పట్టణంలోని 23వ వార్డులో పలువురు వైసీపీ నాయకులు, కొలిమి కార్మికులు జయరాం ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. బుధవారం ఉదయం టీడీపీ నాయకుడు గుజరీ మహమ్మద్ ఖాజా ఆధ్వర్యంలో 50 కుటుంబాలు చేరాయి.

50 కుటుంబాల చేరిక

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 23వ వార్డులో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గుజరిఖాజా, మాజీ కౌన్సిలర్ యాస్మిన్ సమక్షంలో 50 కుటుంబాలు బుధవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం సమక్షంలో టీడీపీ చేరారు.

ఎదురూరులో టీడీపీ జెండా ఎగరవేస్తాం


ఎదురూరులో కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

పామిడి: ఎదురూరు గ్రామంలో టీడీపీ జెండాను ఎగురవేస్తామని మాజీ మంత్రి గుమ్మనూరు జయ రాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ ధీమా వ్యక్తం చేశారు. గ్రామంలో బుధవారం సాయంత్రం 40 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. ఆయన మాట్లాడుతూ... మునుపెన్నడూ లేని విధంగా ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. టీడీపీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. గుత్తి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ప్రభాకర్ చౌదరి, మాజీ జడ్పీటీసీ దాసరి లక్ష్మికాంతమ్మ, బొల్లు శ్రీనివాసరెడ్డి, రామాంజనేయులు నాయక్, రమేష్ నాయక్, మునలిరెడ్డి, పల్లె శ్రీనివాసులు, నారాయణస్వామి, విజయభాస్కర్ నాయుడు, రంగస్వామియాదవ్, ఆర్‌ఆర్ రమేష్, జనసేన ధనుంజయ పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఎదురూరు, అక్కజాంపల్లి, గజరాంపల్లి, పొగరూరు, నీలూరు, తంబళ్లపల్లి గ్రామాల్లో బుధవారం కూటమి అభ్యర్థి గుమ్మనూరు జయరాం తనయుడు ఈశ్వర్ జోరుగా ప్రచారం నిర్వహించారు.

బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ


ప్రచారంలో పాల్గొన్న జేసీ అస్మిత్‌రెడ్డి

పెద్దపప్పూరు, ఏప్రిల్ 17: మండలంలోని ముచ్చుకోటలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి హాజరయ్యారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, జేసీ శశిధర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ గుర్తి రఘునాయుడు, భాస్కర్‌రెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, పెద్దిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటశివారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నాయకులను కలిసిన జేసీ పవన్‌రెడ్డి


సూర్యమునితో మాట్లాడుతున్న జేసీ పవన్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: టీడీపీకి చెందిన సీనియర్ నాయకులను బుధవారం జేసీ పవన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని గానుగవీధిలో ఉంటున్న సూర్యముని, పుట్లూరురోడ్డులోని జగదీశ్వరరెడ్డి, ప్రశాంతినగర్‌లో ఉంటున్న ఎంపీ రంగారెడ్డి ఇళ్లకు పవన్‌రెడ్డి స్వయంగా వెళ్లారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు మీ వంతు సహకారం అందించాలని కోరారు. ఆయన వెంట నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

వడ్డెర్లపై దాడులను సహించేది లేదు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 17: రాష్ట్రంలో వడ్డెర్లపై దాడులకు పాల్పడితే సహించేది లేదని తాడిపత్రి వడ్డెర సంఘం నాయకులు సుబ్బరాయుడు, చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక వడ్డెర సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ వడ్డెర కులస్తుల్లో ఎక్కువశాతం నిరక్షరాస్యులు ఉన్నారన్నారు. వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని రాజకీయ నాయకులు పావులుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ వడ్డెర కాలనీలో నివాసం ఉంటున్న వడ్డెర్లకు మాయమాటలు చెప్పి సీఎం జగన్ సభకు తరలించారన్నారు. కానీ సీఎంపై జరిగిన దాడిలో వడ్డెర్ల హస్తం ఉందంటూ అర్ధరాత్రి సమయంలో వడ్డెర్ల ఇళ్లవద్దకు వెళ్లి వారిని బయటకు పంపి ఇళ్లకు బీగాలు వేశారని ఆరోపించారు. అమాయకులైన వీరిని అక్రమ కేసుల్లో ఇరికించారని వాపోయారు. సమావేశంలో రాజు, రామాంజి, ధనుంజయ, మధు, నారాయణస్వామి, చిన్న సోడన్న పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

ఉరవకొండ, ఏప్రిల్ 17: సంక్షేమంతో కూడిన అభివృద్ధిని అందించే సత్తా ఒక్క చంద్రబాబుకే ఉందని టీడీపీ యువనేత విక్రమ్ సింహా అన్నారు. మండలంలోని రాకెట్ల తండాలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తమ తండ్రి పయ్యావుల కేశవ్‌ను గెలిపించాలని కోరారు.

కాలవను విమర్శించే అర్హత వైసీపీ నాయకులకు లేదు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 17: రాయదుర్గం టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులును విమర్శించే అర్హత వైసీపీ నాయకులకు లేదని వాల్మీకి సంఘం నాయకులు కేశప్ప, రామస్వామి, దివాకర్ అన్నారు. వారు విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ఎంగిలి మెతుకులు తినేవారు కూడా కాలవ శ్రీనివాసులును విమర్శిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న తీర్మానం చేసిన మొట్టమొదటి వ్యక్తి కాలవ అని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో వాల్మీకులకు అనేక హామీలిచ్చి మరచిపోయిన విషయాన్ని వైసీపీ నాయకులకు గుర్తు లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సంగప్ప, కటంబ్లి సుంకన్న, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగరాజు, వీఎల్ రామాంజినేయులు, గోనేహాళ్ రమేష్ పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామాలు ఆమోదం

బెళుగుప్ప, ఏప్రిల్ 17: మండలంలోని శ్రీరంగాపురంలో ఏడుగురు, గుండ్లపల్లిలో నలుగురు, శీర్పిలో ఆరుగురు వలంటీర్లు రాజీనామా చేసినట్లు బుధవారం ఎంపీడీవో సుబ్బరాజు తెలిపారు. ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన సెల్‌ఫోన్లు, సిమ్‌లు, రికార్డులను స్వాధీనం చేసుకుని వారి రాజీనామాలు ఆమోదించినట్లు తెలిపారు.

షర్మిల పర్యటనను విజయవంతం చేయండి

ఉరవకొండ, ఏప్రిల్ 17: న్యాయయాత్రలో భాగంగా ఉరవకొండలో గురువారం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పర్యటనను విజయవంతం చేయాలని అభ్యర్థి వై.మధుసూదన్ రెడ్డి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున పిలుపునిచ్చారు. కార్యక్రమానికి మాజీ మంత్రులు రఘువీరారెడ్డి, శైలజానాథ్ హాజరుకానున్నట్లు తెలిపారు. అబ్బాస్, శ్రీన, ఓబులేశు, సుధాకర్, సీపీఐ నాయకులు మనోహర్, గోపాల్, సుల్తాన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు

యాడికి, ఏప్రిల్17: శ్రీరామనవమిని పురస్కరించుకొని చింతవనం ఆంజనేయస్వామి ఆలయం ఆధ్వర్యంలో యాడికిలో నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. మొదటి బహుమతిని వీరన్నపల్లి గ్రామానికి చెందిన వెంకటరాముడు వృషభాలు, రెండో బహుమతిని నిట్టూరుకు చెందిన కొండన్న వృషభాలు, మూడవ బహుమతిని కుందనకోటకు చెందిన చెన్నప్ప వృషభాలు గెలుపొందాయి. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు.

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం


కదరంపల్లిలో ఆంజనేయస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 17: మండలంలోని బీఎన్‌హళ్లి, రేకులకుంట, కదరంపల్లి గ్రామాలలో బుధవారం ఆంజనేయస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా రాయంపల్లి, కొండాపురం, ఉడేగోళం ఆలయాలలో సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి రథాన్ని ఆలయం వద్ద నుంచి పాతగట్టు వరకు భక్తులు నృత్యాలు, కోలాటాల మధ్య లాగారు.

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం


మత్స్య అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీరామచంద్రమూర్తి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 17: పట్టణంలోని ఏటిగడ్డ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా రామచంద్రమూర్తి మత్స్య అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు


కణేకల్లు క్రాసింగ్‌లో హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న కాలవ

కణేకల్లు, ఏప్రిల్ 17: మండల కేంద్రంలో 19వ తేదీన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పర్యటిస్తున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు పరిశీలించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం 4 గంటలకు చిన్నప్పరెడ్డి సర్కిల్ వద్ద ప్రచార రథం నుంచి ప్రజలనుద్దేశించి మాట్లాడనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఆది, బీటీ రమేష్, కోకుర్తి సుదర్శన్, షేక్‌ముజ్జు, అనిల్, బసవరాజు, ఉండాల హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ షురూ...

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 17: నియోజకవర్గంలో గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతున్నట్లు ఆర్డీవో రాణి సుష్మిత తెలిపారు. రాజకీయ పార్టీ అభ్యర్థులు, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఫారమ్ 2బి, ఫారమ్ 26 పూర్తిగా పూరించాలన్నారు. అభ్యర్థుల కోసం ఆర్వో ఆఫీసులో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. 25వ తేదీ వరకు ఉదయం 11 నుంచి 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఎవరైతే నామినేషన్ వేస్తారో అభ్యర్థి వెంట నలుగురు మాత్రమే అనుమతిస్తామని తెలిపారు.

ఆదివారం నామినేషన్లు స్వీకరించం: ఆర్వో

రాయదుర్గం: ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో ఆదివారం 21వ తేదీన సెలవు కారణంగా నామినేషన్‌లు స్వీకరించమని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కరుణకుమారి తెలిపారు. ఆమె బుధవారం విలేకరుల సమావేశాన్ని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు తెలిపారు.

గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

● కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి శైలజానాథ్

యల్లనూరు, ఏప్రిల్ 17: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని శైలజానాథ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను శాసనసభ్యుడిగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి తప్ప ప్రస్తుత పాలకుల అభివృద్ధి కనిపించడం లేదన్నారు. యల్లనూరు, పుట్లూరు మండలాల్లో విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రెండు మండలాల్లో గ్రామాలకు సరైన రహదారులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తనను గెలిపిస్తే పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఎర్రమరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, విష్ణు పాల్గొన్నారు.

రాజీనామా చేయండి.. నేను చూసుకుంటా..

● వలంటీర్లకు రంగయ్య ప్రలోభాలు


రహస్య సమావేశం అనంతరం భోజనానికి క్యూలైన్‌లో వున్న వలంటీర్లు

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 17: 'ఉద్యోగాలకు రాజీనామా చేయండి. మీ ఉద్యోగాలకు నాదీ భరోసా' అంటూ వైసీపీ అభ్యర్థి రంగయ్య వలంటీర్లను ప్రలోభపెట్టారు. దొడగట్ట రోడ్డులోని షాదీమహల్‌లో వలంటీర్లతో రంగయ్య, వైసీపీ నాయకులు ఉమామహేశ్వర్ నాయుడు, తిప్పేస్వామి, వలంటీర్ల అబ్జర్వర్ ప్రతాప్ రెడ్డి, నియోజకవర్గ వలంటీర్ల అబ్జర్వర్ హనుమంతరెడ్డి బుధవారం రహస్య సమావేశం నిర్వహించారు. వలంటీర్లు మొబైల్ ఫోన్లు స్విచాఫ్ చేయించిన అనంతరం సమావేశాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలో ఉన్న 1570 మంది వలంటీర్లలో 200 మంది బుధవారం రాజీనామా చేసినట్లు తెలిసింది. మరో 1370 మంది రెండు రోజుల్లో రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటి నుంచి వారు ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొంటూ వైసీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రంగయ్య పిలుపునిచ్చారు. అయితే కొంతమంది వలంటీర్లు రాజీనామా చేయడానికి సుముఖతగా లేకపోవడంతో వారికి మీ ఉద్యోగానికి మా భరోసా అంటూ నాయకులు సముదాయించి రాజీనామా చేసే విధంగా అడుగులు వేస్తున్నట్లు తెలిసింది.

టీడీపీ అధికారంలోకి వస్తే 50 ఏళ్లకే పింఛన్

● రోడ్‌షోలో అమిలినేని


ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు

కుందుర్పి, ఏప్రిల్ 17: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే యాభై ఏళ్లకే పింఛన్ వస్తుందని ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు అన్నారు. మండల పరిధిలోని రుద్రంపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేనికి ఆ పార్టీ నాయకులు, మహిళలు, గ్రామస్తులు పూలవర్షం కురిపించి గజమాలతో ఘన స్వాగతం పలికారు. అమిలినేని మాట్లాడుతూ గత ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి బీసీలకు 45 యేళ్లకే పింఛన్ ఇస్తామని ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక మరిచిపోయాడన్నారు. టీడీపీ అధ్యక్షులు చంద్రబాబునాయుడు తన మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 50 యేళ్లకే అది కూడా రూ.4 వేలు ఇంటిదగ్గరికే ఇస్తారని, ప్రతి ఒక్కరు టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

ఇరువర్గాల ఘర్షణ... ముగ్గురికి గాయాలు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 17: మండలంలోని కదరంపల్లి గ్రామంలో బుధవారం ఇంటి స్థల విషయంలో ఘర్షణ పడడంతో ముగ్గురు గాయపడ్డారు. ఇంటి ముందు స్థలం విషయంపై రుద్రప్ప వర్గీయులు నీలప్ప, లక్ష్మీదేవి, తిప్పేస్వామి, అంగడి రామాంజనేయులతో పాటు మరో కొంతమంది గురుమూర్తి వర్గీయులు వన్నూరుస్వామి, రాము, తిప్పేస్వామితో ఘర్షణ పడడంతో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు గమనించి క్షతగాత్రులను రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రాము అనే వ్యక్తిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

అరటి చెట్లు దగ్ధం

యల్లనూరు, ఏప్రిల్17: మండలంలోని కూచివారిపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో 10వేల అరటిచెట్లు అగ్నికి ఆహుతయ్యాయని బాధితుడు వేణుగోపాల్‌నాయుడు తెలిపారు. బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో విద్యుత్‌వైర్లు ఒకదానికొకటి తగలడంతో మంటలు చెలరేగాయి. ఆర్పడానికి ప్రయత్నించేలోపే తోటలో ఉన్న డ్రిప్పు పరికరాలు, కాయలతో ఉన్న అరటిచెట్లు దగ్ధమయ్యాయి. వీటి విలువ దాదాపు రూ.10లక్షలకు పైగా ఉంటుందని బాధితుడు వాపోయాడు. పదిరోజుల వ్యవధిలో అరటికాయలు కోతదశకు చేరుకుంటాయని, ఈ సమయంలో ప్రమాదానికి గురై కాలిపోవడం తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని బాధితుడు వాపోయాడు. అలాగే మండలంలోని వేములపల్లి గ్రామ నర్సరీలో చీనీమొక్కలు అగ్నికి దగ్ధమయ్యాయి. గ్రామంలోని సుబ్బయ్యకు చెందిన తోటలో ఒకవైపు నర్సరీలో చీనీ మొక్కలు పెంచుతూ ఉండేవాడు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు వేయడంతో పక్కలో ఉన్న చెత్తనుంచి నిప్పు మొక్కలపైకి వ్యాపించింది. వెయ్యికి పైగా మొక్కలు దగ్ధమైనట్లు బాధితుడు వాపోయాడు.

పేకాట స్థావరంపై దాడి

బెళుగుప్ప, ఏప్రిల్ 17: మండలంలోని దుద్దేకుంటలో బుధవారం పేకాటస్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు. గ్రామ శివార్లలో జూదమాడుతున్న సమాచారం అందడంతో సిబ్బందితో కలసి దాడి చేసి ఐదు బైకులను సీజ్ చేయడంతో పాటు ఏడుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.25,190 స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రాయదుర్గం, ఏప్రిల్ 17: మండలంలోని రాయంపల్లి గ్రామం వద్ద కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ మురళీమోహన్ తెలిపారు. 2400 టెట్రా ప్యాకెట్లు 24 బాక్సుల మద్యాన్ని సంచుల్లో నాలుగు ద్విచక్రవాహనాలలో తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. నాలుగు వాహనాలు సీజ్ చేసి నిందితుల కోసం గాలిస్తున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బ్రహ్మసముద్రం: బ్రహ్మసముద్రం పోలీసులు బుధవారం ఎరడికెర పోలీస్ చెక్‌పోస్టు వద్ద అదే గ్రామానికి చెందిన గోవిందును అరెస్టు చేసి 384 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పరశురాముడు తెలిపారు. చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా కర్ణాటక నుంచి గోవిందు అనే వ్యక్తి జిల్లాలోకి మద్యం తీసుకొస్తున్నట్లు గుర్తించి అతనిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

నామినేషన్ కేంద్రం పరిశీలన

ఉరవకొండ, ఏప్రిల్ 17: పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలోని నామినేషన్ కేంద్రాన్ని ఎస్పీ అమిత్‌బర్దర్ బుధవారం రాత్రి పరిశీలించారు. నామినేషన్ల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఐలకు ఆదేశాలిచ్చారు. వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి, సీఐలు సురేష్‌బాబు, ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ రాఘవేంద్ర పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండలంలోని దేవునిఉప్పలపాడు, తురకపల్లి, ముచ్చుకోట, పెద్దయక్కలూరు, వరదాయపల్లి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ పరిశీలించారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. ఆయన వెంట ఎస్‌ఐ శరత్‌చంద్ర ఉన్నారు.

ఇరువర్గాలతో డీఎస్పీ సమావేశం

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 17: పుట్లూరు మండలంలోని శనగలగూడూరు గ్రామంలో బుధవారం రాత్రి డీఎస్పీ వెంకటశివారెడ్డి ఇరువర్గాలతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చిన్నచిన్న సమస్యల్ని పెద్దగా చూపి గొడవలకు వెళ్లరాదన్నారు. ఆయన వెంట సీఐ సుబ్రహ్మణ్యం, స్పెషల్‌పార్టీ పోలీసులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

పుట్లూరు, ఏప్రిల్ 17: మండలంలోని గాండ్లపాడు గ్రామ శివారులో బుధవారం వాహనాల తనిఖీ చేసినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేసి పంపిస్తున్నారు. అక్రమ నగదు, ఇతర వస్తువులు ఏమైనా తరలిస్తున్నారని తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను సీఐ కోరారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది గోవిందరాజులు, నాగప్ప పాల్గొన్నారు.

కమనీయం... సీతారాముల కల్యాణం

శ్రీరామనవమి సందర్భంగా పలు ఆయాల్లో సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. బుధవారం సీతారామాలయాల్లోనే కాకుండా వివిధ ఆలయాల్లో సీతాదేవీ, శ్రీరాముల ఉత్సవాలను ప్రతిష్ఠించి వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయాల ముందు భక్తులకు పానకాలు పంపిణీ చేశారు. అలాగే అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

\- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


రాయదుర్గంలో బారులుతీరిన భక్తులు



మరుట్లలో స్వామి వారి విగ్రహంతో రేవంత్ కుమార్ రెడ్డి


ఉరవకొండ మండలం లత్తవరంలో...


గుంతకల్లులో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న జయరాం


విడపనకల్లు: పూజలో పాల్గొన్న భక్తులు


కూడేరులో కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు


బెళుగుప్పలో...


తాడిపత్రి పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో...



గుత్తిలో నృత్యం చేస్తున్న కళాకారులు

రేపు ఎమ్మెల్యే కేశవ్ రోడ్ షో

బెళుగుప్ప, ఏప్రిల్ 17: మండలంలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ శుక్రవారం రోడ్డు షో నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ ప్రసాద్ బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు రోడ్‌షో ప్రారంభమవుతుందని రామసాగరం, జీడిపల్లి, వీరాంజనేయ, కొట్టాల, కోనంపల్లి, దుద్దేకుంట, అంకంపల్లి, తగ్గుపర్తి గ్రామాలలో సాయంత్రం 5 గంటలకు బెళుగుప్ప, బెళుగుప్ప తండాలో రోడ్‌షో వుంటుందని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని రోడ్‌షోను విజయవంతం చేయాలని కోరారు.

సైకోను సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి

యాడికి, ఏప్రిల్ 17: ఎన్నికల్లో సైకోను సాగనంపితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య అన్నారు. బుధవారం మండలంలోని రాయలచెరువులో టీడీపీ నాయకులు ప్రచారం చేశారు. పరిమి చరణ్, గోపాల్‌నాయుడు, అమిలినేని సత్య, బాబుగౌడ్, శోభన్‌బాబు, మాదాల అనిల్, శేఖర్, రామానాయుడు, కుల్లాయప్ప, జాఫర్, రంగ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో పాలిసెట్ హాల్‌టిక్కెట్లు పొందండి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 17: పాలిసెట్ 2024 ప్రవేశ పరీక్షలకు సంబంధించి హాల్ టిక్కెట్లను ఆన్‌లైన్‌లో పొందాలని గుంతకల్లు పాలిసెట్ కోఆర్డినేటర్ కే ఆష్రఫ్ అలీ, గుంతకల్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శివకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సరోజినాయుడు మున్సిపల్ బాలికల పాఠశాల, సర్వేపల్లి రాధకృష్ణ మున్సిపల్ పాఠశాల, ఎస్‌జేపీ హైస్కూల్, కేసీనారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రవేశ పరీక్ష 27వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉంటుందన్నారు.